

ఘనంగా పైడిమాంబ తొలేళ్ల ఉత్సవం

కంచరపాలెం ప్రాంతంలోని రామ్మూర్తిపంతులుపేట గ్రామ దేవత పైడితల్లమ్మ తొలేళ్ల ఉత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామ సంప్రదాయం ప్రకారం పెద్దసంఖ్యలో భక్తులు నగరంలోని పాత జైలు రోడ్డు వద్ద గల బంగారమ్మ గుడికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ప్రతిమలను మోసుకుంటూ జగదాంబ సెంటర్, పూర్ణామార్కెట్, మనోరమ, కాన్వెంట్ జంక్షన్, జ్ఞానాపురం మీదుగా ఆర్పీపేటలోని అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. ఉత్సవం సందర్భంగా అమ్మవారి ప్రధానాలయాన్ని దేదీప్యమానంగా అలంకరించారు. మంగళవారం ప్రధాన పండగ కోసం విస్తృత ఏర్పాట్లు చేశారు. -ఆంధ్రజ్యోతి, కంచరపాలెం



అంగరంగ వైభవంగా అనంత పద్మనాభుని కల్యాణోత్సవం



భక్తుల గోవింద నామస్మరణ, జయ జయ ధ్వానాల మధ్య అనంతపద్మనాభుని కల్యాణోత్సవం సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఫాల్గుణ మాసం శుద్ధ ఏకాదశి రోజున స్వామివారి కల్యాణోత్సవం వైదిక, వైఖానస సంప్రదాయం ప్రకారం నిర్వహించడం ఆనవాయితీ. ఏటా మాదిరిగానే శ్రీదేవి, భూదేవి సమేత అనంత పద్మనాభస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా కుంతీ మాధవస్వామి ఆలయంలోని కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. ప్రధాన అర్చకులు పి.సీతారామాంజనేయస్వామి ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.

-8లో

స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్ బ్యాక్‌లో అగ్రస్థానాన జీవీఎంసీ

విశాఖపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్-2025 ఫీడ్‌బ్యాక్‌లో జీవీఎంసీ దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా పోటీ పడుతున్న నగరాల నుంచి ఇప్పటివరకూ 42 లక్షల మంది తమ అభిప్రాయాలను తెలియజేశారు. అందులో 2,60,508 మంది జీవీఎంసీకి సంబంధించిన ఫీడ్‌బ్యాక్ తెలియజేసినవారు కావడం విశేషం. తర్వాత స్థానంలో పూణే (94,862 మంది), విజయవాడ (84,432), ఇండోర్ (67,108), నవీముంబై (49,672), భోపాల్ (47,750) నిలిచాయి. స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్‌బ్యాక్‌లో వచ్చే మార్కులు ర్యాంకు నిర్ణయించడంలో కీలకంగా మారతాయి. ఈ నెలాఖరు వరకు వెబ్‌సైట్, స్వచ్ఛతా యాప్ ద్వారా ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేసే అవకాశం ఉంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళ) 6.09
సహరి (బుధ) 4.51

హయగ్రీవకు ఝలక్

ఎండాడలో భూమిని వెనక్కి తీసుకుంటూ ప్రభుత్వం ఉత్తర్వులు

- ఫలించిన నాయకుల పోరాటం
- వృద్ధాశ్రమం కోసమని భూమి తీసుకుని ఇష్టారాజ్యంగా ప్రైవేటు వ్యక్తులకు అమ్మకాలు
- దుర్వినియోగం చేస్తున్నట్టు నిర్ధారణ కావడంతో సర్కారు కొరడా
- ప్రభుత్వ భూములను కొనుగోలు చేసేవారికి ఇదో హెచ్చరిక
- తస్మాత్ జాగ్రత్త



ప్రభుత్వ స్థలంలో హయగ్రీవ సంస్థ చేపట్టిన నిర్మాణాలు (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వృద్ధుల పేరు చెప్పి కోట్ల రూపాయల ప్రభుత్వ స్థలం కొల్లగొట్టి దాంతో వందల కోట్ల వ్యాపారం చేసిన 'హయగ్రీవ ఫామ్స్ అండ్ డెవలపర్స్' సంస్థకు ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. దాదాపు పదహారేళ్ల కిందట ఎండాడలో వృద్ధాశ్రమం కోసం 'హయగ్రీవ'కు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన 12.51 ఎకరాలను వెనక్కి తీసుకుంటూ కూటమి ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. తక్కువ ధరకు వస్తున్నాయని ఎడాపెడా ప్రభుత్వ భూములను కొనుగోలు చేసే వారికి ఇదో పెద్ద గుణపాఠం కానున్నది.

ఎన్నెన్నో మలుపులు

ప్రభుత్వం 'హయగ్రీవ' జగదీశ్వరుడికి భూమిని కేటాయిస్తే...అందులో ఓల్డ్ ఏజ్ హోమ్ కట్టకుండానే దానిపై ఆయన అప్పులు చేశారు. అవసరమైనప్పుడల్లా అప్పులు ఇచ్చిన ఆడిటర్ జి.వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణలు తమ అప్పు మొత్తం తిరిగి ఇవ్వలేదని ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు. వారి మనిషిగా గద్దె బ్రహ్మాజీని ఎండీగా పెట్టారు. జగదీశ్వరుడి ప్రమేయం లేకుండా ఆ స్థలంలో పనులు ప్రారంభించారు. ప్లాట్లుగా విభజించారు. రెసిడెన్షియల్ గ్రూపు పథకం పెట్టారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎంపీగా తన మాట ... మిగతా 6వ పేజీలో

లాడ్జిల్లో ఆకస్మిక తనిఖీలు



నగరంలోని ఓ లాడ్జిలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

విశాఖపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని 96 హోటళ్లు/లాడ్జిల్లో ఆదివారం రాత్రి పోలీసులు బృందాలుగా ఏర్పడి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. హోటళ్లలో బస చేసిన వారిలో ఏదైనా కేసులో పరారీలో ఉన్న నిందితులు ఎవరైనా ఉన్నారా?, ఎన్‌బీడబ్ల్యూ పెండింగ్‌లో ఉన్నవారు ఎవరైనా ఉన్నారా?, విదేశీయులైతే సక్రమంగా పత్రాలు ... మిగతా 6వ పేజీలో

చేజారిన ప్రభుత్వ స్థలం

విలువ రూ.15 కోట్లపైనే...

- కోర్టు నోటీసులు సకాలంలో అధికారులకు అందకుండా రెవెన్యూ శాఖ సిబ్బంది మాయాజాలం
- తీర్పు వెలువడిన ఐదు నెలల తరువాత సమాచారం



హేచరీస్

విశాఖపట్నం/భీమిలి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): **భీమిలి మండలం కె.నగరపాలెం, మంగమారిపేట, కాపులుప్పాడ గ్రామాల పరిధిలో సుమారు రూ.15 కోట్ల విలువైన భూములను కాపాడుకోవడంలో రెవెన్యూ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సకాలంలో స్పందించకపోవడంతో కోర్టు డిక్రీ ఇచ్చిన విషయం కూడా ఐదు నెలల తరువాత అధికారులకు తెలియడం విశేషం. ఈ వ్యవహారంలో రెవెన్యూ శాఖలోని కిందిస్థాయి సిబ్బంది పాత్ర ఉందనే వాదన బలంగా వినిపిస్తోంది.**

కె.నగరంపాలెం, మంగమారిపేట, కాపులుప్పాడ పరిధిలో సర్వే నంబర్లు 296/4 సీ, 298/6 నుంచి 9లో సుమారు 2.42 ఎకరాల్లో ప్రస్తుతం సాయిబాలాజీ హేచరీస్ నిర్వహిస్తున్నారు. ఆ భూమి అంతకుముందు పలుమార్లు చేతులు మారింది. 2012లో సాయిబాలాజీ సంస్థ లీజుకు తీసుకుంది. హేచరీస్‌లో 1.57 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని భీమిలి తహసీల్దార్ 2023లో నోటీసు జారీచేసి, కొన్ని కట్టడాలను తొలగించారు. దీనిపై హేచరీస్ నిర్వాహకులు హైకోర్టును ఆశ్రయించినా...రెవెన్యూ అధికారులు భూమి స్వాధీనానికి యత్నించారు. దీనిపై కూడా నిర్వాహకులు రెండోసారి కోర్టుకు వెళ్లారు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో హేచరీస్ యాజమాన్యం జిల్లా కోర్టులో శాశ్వత ఇంజంక్షన్ ఆర్డర్ కోసం పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై కోర్టు గత ఏడాది అక్టోబరు నాలుగున శాశ్వత ఇంజంక్షన్ డిక్రీ జారీచేసింది. అయితే కోర్టు కేసుకు సంబంధించిన నోటీసులు కలెక్టర్, భీమిలి ఆర్డీవో, తహసీల్దార్‌కు అందకుండా రెవెన్యూలో కిందిస్థాయి అధికారులు మేనేజ్ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విశాఖపట్నం-భీమిలి బీచ్‌రోడ్డుకు ఆనుకుని అత్యంత కీలక ప్రాంతంలో ఉన్న ఈ భూమి విలువ రూ.15 కోట్లకు పైగా ఉంటుంది. సీఆర్‌జడ్‌లో ఆక్రమణలు తొలగించాలని భావిస్తున్న నేపథ్యంలో రెవెన్యూలో ఒకరిద్దరు ఉద్యోగుల కారణంగా కోర్టు డిక్రీ జారీ కావడాన్ని ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఎర్రమట్టి దిబ్బలకు ఆనుకుని ఉన్న బిల్డింగ్ సొసైటీ భూముల వ్యవహారంలో అధికారులకు సమాచారం లేకుండా చేసిన వ్యక్తులే హేచరీస్ కేసులో కీలక భూమిక పోషించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత ఏడాది అక్టోబరు నాలుగున జారీ చేసిన ఆదేశాలకు సంబంధించిన కాపీలు ఐదు నెలల తరువాత అంటే మూడు రోజుల క్రితం ఆర్డీవో, తహసీల్దార్‌కు అందాయి. ఈ విషయం భీమిలి ఆర్డీవో ... మిగతా 6వ పేజీలో

ఉక్కు ఫైనాన్స్ డైరెక్టర్ పోస్టుకు 21న ఇంటర్వ్యూలు

విశాఖపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో చాలాకాలంగా ఖాళీగా ఉన్న డైరెక్టర్ పోస్టుల భర్తీపై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించింది. రెండు రోజుల క్రితం ఆపరేషన్స్ డైరెక్టర్‌గా సలీం జి పురుషోత్తమన్‌ను నియమించింది. శనివారం ఉత్తర్వులు రాగా ఆయన ఆదివారం సెలవు రోజున బాధ్యతలు స్వీకరించారు. తాజాగా ఫైనాన్స్ డైరెక్టర్ పోస్టును భర్తీ చేయడానికి ఈ నెల 21వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ప్రకటించింది. ఇదిలావుండగా సీఎండీ పోస్టుకు కూడా ఒకరిని నాలుగు నెలల క్రితమే ఎంపిక చేశారు. అయితే ఆయనకు బాధ్యతలు అప్పగించకుండా...మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్ నుంచి శక్తిమణిని డిప్యూటేషన్‌పై తీసుకువచ్చి పెట్టారు. ఆయన ఇక్కడ ఉద్యోగులను, కాంట్రాక్టు కార్మికులను తగ్గించే పనిలో ఉన్నారు. తాజాగా 900 మంది కాంట్రాక్టు కార్మికులను ఆపేశారు. దీనిపై కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నాయి.

పోలీస్ శాఖలో పదోన్నతులు, బదిలీలు

విశాఖపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు సిబ్బందికి పదోన్నతులు కల్పిస్తూ సీపీ శంఖబ్రతబాగ్చి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న ఆరుగురికి హెడ్ కానిస్టేబుళ్లుగా ... మిగతా 6వ పేజీలో

వైసీపీ నేత బరితెగింపు

తమ పార్టీ అధికారంలో ఉండగా 400 గజాల ప్రభుత్వ స్థలం అమ్మకం

- గజానికి రూ.15 వేల చొప్పున ముగ్గురి నుంచి రూ.45 లక్షలు వసూలు
- అందులో ఒకరు తాజాగా కల్యాణ మండపం నిర్మాణం చేపట్టడంతో జాయింట్ కలెక్టర్‌కు స్థానికుల ఫిర్యాదు
- స్థలం స్వాధీనం చేసుకునేందుకు వెళ్లిన రెవెన్యూ అధికారులపై నేతల ఒత్తిళ్లు



గాజువాక బీసీరోడ్డుని ఆనుకుని సర్వేనంబర్ 43/1డీలోని ప్రభుత్వస్థలంలో నిర్మిస్తున్న కల్యాణమండపం

(విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి)

గాజువాక నియోజక వర్గానికి చెందిన వైసీపీ నేత కుమారుడి అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. దయాల్‌నగర్ కొండపై ఇళ్లు నిర్మించుకున్న వారి వద్ద రూ.లక్షలు గుంజిన ఆయన...400 గజాల ప్రభుత్వ భూమిని అమ్మేసిన వైనం వెలుగుచూసింది. వివరాలిలా ఉన్నాయి.

పెదగంట్యాడ సర్వే నంబర్ 43/1డి, సర్వే నంబర్ 43/5ఏ1లో 400 గజాలు ప్రభుత్వ భూమి ఉంది. దానికి అనుకుని నగరానికి చెందిన ఒక పారిశ్రామికవేత్తకు సుమారు 1,700 గజాలు జిరాయితీ స్థలం ఉండేది. దానిని దాదాపు నాలుగేళ్ల కిందట సదరు పారిశ్రామికవేత్త అమ్మకానికి పెట్టారు. గజం రూ.32 వేలు చొప్పున కొనుగోలు చేసేందుకు ముగ్గురు ఒప్పందం చేసుకున్నారు. ఈ విషయం వైసీపీ నేత కుమారుడికి తెలియడంతో తనకు కూడా ఆ భూమిలో వాటా కావాలని పట్టుబట్టారు. అప్పుడు వైసీపీ అధికారంలో ఉండడంతో కాదనలేక ఆయన్ను కలుపుకుని పారిశ్రామికవేత్త నుంచి నలుగురు కలిసి భూమి కొనుగోలు చేశారు. ఆ భూమిని ఆనుకుని ఉన్న 400 గజాలు ప్రభుత్వ భూమిని కలిపి పారిశ్రామికవేత్త ప్రహరీ నిర్మించినప్పటికీ, కేవలం జిరాయితీ భూమిని మాత్రమే రిజిస్ట్రేషన్ చేసి ఆ మేరకు మాత్రమే డబ్బులు తీసుకున్నారు. ప్రహరీ లోపల ఉన్న ప్రభుత్వ భూమిని అలాగే వదిలేశారు. రిజిస్ట్రేషన్ అయిన తర్వాత పారిశ్రామికవేత్త నుంచి కొనుగోలు చేసిన భూమిని ఆనుకుని ఉన్న 400 గజాలు ప్రభుత్వ భూమిని ఎవరి వాటా వాళ్లు తీసుకోవాలనుకుంటే తనకు గజానికి రూ.16 వేలు ఇవ్వాల్సిందేనని, లేనిపక్షంలో సర్వే చేయించి ప్రభుత్వం ద్వారా తాను తీసుకుంటానని వైసీపీ నేత కుమారుడు బెదిరించారు. అసలే అధికార పార్టీకి చెందిన నేత కుమారుడు కావడంతో మరోదారిలేక ప్రతి ఒక్కరూ వంద గజాలు ప్రభుత్వ స్థలానికి రూ.15 లక్షలు చొప్పున వైసీపీ నేత కుమారుడికి సమర్పించుకున్నారు. పారిశ్రామికవేత్త నుంచి భూమిని కొనుగోలు చేసిన వారిలో ఒకరు ఇప్పుడు అక్కడ కల్యాణ మండపం నిర్మాణం చేపట్టారు. అందులో ప్రభుత్వ స్థలం ఉందంటూ కొందరు జిల్లా జాయింట్ కలెక్టర్‌కు నేరుగా ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఆ భూమి సర్వే చేసి ప్రభుత్వ భూమిలో ... మిగతా 6వ పేజీలో

పేదలందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి



- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- భారీ ర్యాలీగా వెళ్లి చిన గదిలి తహసీల్దారుకు దరఖాస్తుల సమర్పణ

-8లో

ఏప్రిల్ 1 నుంచే ఇంటర్ తరగతులు

7 నుంచి ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు

- 24 నుంచి జూన్ 1 వరకు సెలవులు
- 2025-26 విద్యా సంవత్సరంలో మార్పులు, చేర్పులు
- ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు మెరుగుపడే అవకాశం

మద్దిలపాలెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరం (2025-26) నుంచి మార్పులు, చేర్పులకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఇప్పటివరకూ ఇంటర్ వార్షిక పరీక్షలు ముగిసిన తర్వాత సెలవులు ఇస్తున్నారు. జూన్ ఒకటో తేదీ నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభిస్తున్నారు. సెలవుల్లో ప్రైవేటు కళాశాలలు మాత్రం ప్రవేశాలు, తరగతులు నిర్వహిస్తుండేవి. దీంతో ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు తగ్గిపోతున్నాయి. అంతేగాకుండా ప్రైవేటు కళాశాలల విద్యార్థులతో పోల్చితే ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు చదువులో వెనుకబడుతున్నారు. దీనిని అధిగమించడానికి ఈసారి ఏప్రిల్ ఒకటో తేదీ నుంచే ద్వితీయ సంవత్సరం క్లాసులు ప్రారంభించనున్నారు. మార్చి 17 నుంచి 31 వరకు పదో తరగతి పరీక్షలున్నందున ... మిగతా 6వ పేజీలో



స్వామివారికి స్వర్ణ పుష్పార్చన చేస్తున్న దృశ్యం

సింహాచలేశునికి స్వర్ణ తులసీ దళార్చన

సింహాచలం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): శ్రీవరాహ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి సోమవారం 108 బంగారు సంపెంగలతో స్వర్ణ తులసీదళార్చన వైభవంగా జరిగింది. దేవస్థానం పండితులు వేదమంత్రాలు, నాదస్వర మంగళ వాయిద్యాలతో శాస్త్రోక్తంగా స్వర్ణ తులసీదళాలతో అర్చనగావించారు. అర్చకులు వేకువ జామున స్వామిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవింద రాజ స్వామివారిని సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలో వేదికపై అధిష్ఠింపజేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి స్వర్ణపుష్పార్చన సేవ వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివారి ఆర్జిత సేవలలో పాల్గొన్నారు.

స్వామిని దర్శించుకున్న పీలా గోవింద్

లక్ష్మీనరసింహ స్వామి వారిని అర్బన్ ఫైనాన్స్ అండర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో ఎస్.ఆనంద్ కుమార్ ఆయనకు స్వాగతం పలికారు. ముందుగా స్వామివారిని దర్శించుకుని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడ ప్రదక్షిణ, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రాలతో వేద ఆశీర్వచనం అనంతరం స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

భీమునిపట్నం (రూరల్) మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిప్పాడ గ్రామంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 350 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కొసనవానిపాలెం, మూలకుద్దు సిటీ నగర్ ప్రాంతాల్లోని పాఠశాలలకు చెందిన విద్యార్థులు శిబిరానికి విచ్చేశారు. ఆయా పాఠశాలలకు దివీస్ యాజమాన్యం ప్రథమ చికిత్స కిట్లను అందజేసింది. తాళ్లవలస పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ శోభారాణి, తదితరులు వైద్య పరీక్షల్లో పాల్గొన్నారు. చిప్పాడ హైస్కూల్ హెచ్‌ఎం రత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆనందపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఆనందపురం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్నందున మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ సురేష్‌కుమార్ తెలిపారు. పొడుగుపాలెం, చందక, వెంకటాపురం, కుసులువాడ తదితర గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు.

గంధవరం పరిధిలో...

పద్మనాభం: గంధవరం పరిధిలో గృహ, వ్యవసాయ విద్యుత్ లైన్లను వేరు చేసే పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా కు అంతరాయం కలుగుతుందని విశాఖపట్నం జోన్-3 ఆపరేషన్ ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. విలాస్కాన్‌పాలెం, బాందేవుపురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆయన తెలిపారు.

లైఫ్‌గార్డుల నిజాయితీ

సాగర్‌నగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రుషికొండ బీచ్‌లో దొరికిన సంచిని లైఫ్‌గార్డులు, పోలీసు కలిసి సోమవారం పోగొట్టుకున్న యువకుడికి అప్పగించారు. మెరైన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. నరసరావుపేటకు చెందిన గంగాధర్ ఆనంద్ అనే యువకుడు ఆదివారం రుషికొండ బీచ్‌కు విహారానికి వచ్చాడు. సరదాగా గడిపిన ఆ యువకుడు తనతో పాటు తెచ్చుకున్న సంచిని బీచ్‌లో మరచి వెళ్లిపోయాడు. బీచ్‌లో విధులు నిర్వర్తిస్తున్న లైఫ్‌గార్డులు, పోలీసు ఒకరికి ఆ సంచి కంటపడింది. దీంతో వారు మెరైన్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.అందులో ఏటీఎం కార్డు, ఇతర పత్రాలు ఉన్నట్లు ఆ యువకుడు తెలిపాడు.

అల్లు బాబూరావు మృతికి కార్మిక సంఘాల నేతల సంతాపం

తగరపువలస, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన చిట్టివలస జూట్‌మిల్లు కార్మిక సంఘం నాయకుడు, సీపీఐ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లు బాబూరావుకు వివిధ కార్మిక సంఘాల నాయకులు సంతాపం ప్రకటించారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొండపు ఈశ్వరరావు అధ్యక్షతన సోమవారం జూట్‌మిల్లు కల్యాణ మండపంలో సంతాపసభ నిర్వహించి బాబూరావు చేసిన పోరాటాలను గుర్తు చేసుకుని నివాళులర్పించారు. వివిధ సంఘాల నాయకులు జీరు వెంకటరెడ్డి, దల్లి అప్పలరెడ్డి, మునకాల ఆదినారాయణ, ఎస్.అప్పలనాయుడు, ఆర్.నర్సింగరావు, కానూరి రాంబాబు, మామిడి గురువులు, చిల్లా రాం పైడి మాట్లాడారు. ఆంధ్ర ప్రజానాట్యమండలి కళాకారులు నృత్యాలు, పాటలతో బాబూరావుకు నివాళులర్పించారు.

అధికారుల మధ్య సమన్వయ లోపం!

▸ ప్రజలకు శాపం ▸ నిర్మాణం జరిగి మూడు నెలలైనా ప్రారంభానికి నోచుకోని పబ్లిక్ టాయిలెట్లు

భీమునిపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-1లో పబ్లిక్ వర్క్స్, పబ్లిక్ హెల్త్ విభాగ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడి పాత బస్టాండ్‌లో జీవీఎంసీ నిధులతో పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణాలు పూర్తయి మూడు నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోకపోవడాన్ని ఇందుకు ఉదాహరణగా పేర్కొనవచ్చు. దీంతో ప్రయాణికులు, ప్రజలకు టాయిలెట్ల ఇక్కట్లు తప్పడం లేదు. ఈ విషయమై పబ్లిక్ వర్క్స్ విభాగ అసిస్టెంట్ ఇంజనీర్ సురేశ్‌తో మాట్లాడగా.. టాయిలెట్ల నిర్మాణం ఎప్పుడో పూర్తయిందని, అయితే కేర్ టేకర్లను నియమించాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఏఎంహెచ్‌వోకు లేఖ రాశామన్నారు. వారు కేర్ టేకర్లను నియమిస్తే తమ వద్దనున్న టాయిలెట్ల తాళాలను వారికి అప్పగిస్తామన్నారు.

అలాగే జోన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బీఎం నాయుడుతో మాట్లాడగా.. టాయిలెట్ల తాళాలు ఇంజనీరింగ్ విభాగం వారి వద్ద ఉన్నాయని, తమకు అప్పగిస్తే వర్కర్‌ను నియమిస్తామని చెబుతున్నారు. ఇలా ఈ రెండు విభాగాల మధ్య అవగాహన లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఇక్కడకు నంబర్ '900కే' ఆర్టీసీ బస్సులు, మధురవాడ, దొరతోట మీదుగా నంబర్ '999' బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆయా బస్సులను ఇక్కడ నిలిపాక



పాత బస్టాండ్ వద్ద నిర్మించిన పబ్లిక్ టాయిలెట్లు

వాటి డ్రైవర్లు, కండక్టర్లు ఇక్క టాయిలెట్ల సదుపాయం లేక నరకయాతనకు గురవుతున్నారు. మహిళా కండక్టర్ల పరిస్థితి మరీ దయనీయంగా ఉంటుంది. అలాగే పలువురు మహిళా ప్రయాణికులు కూడా ఇక్కడ టాయిలెట్ల సదుపాయం లేక తమ బాధ ఎవరికీ చెప్పుకోలేక లోలోన బాధ పడుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి టాయిలెట్ల ప్రారంభానికి పటిష్ఠ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రతి అంశాన్ని పరిశోధన దృష్టితో చూడాలి

▸ శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కేఎస్ కృష్ణ

సాగర్‌నగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సైన్స్ కోర్సులు చదివే విద్యార్థులందరూ ప్రతి అంశాన్ని పరిశోధన దృష్టితో చూడాలని శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కేఎస్ కృష్ణ అన్నారు. సైన్స్ కోర్సులను అభ్యసించే విద్యార్థులలో నూతన ఆవిష్కరణలపై అవగాహన పెంచడంతో పాటు వారిలో స్ఫూర్తిని కలిగించడానికి వీలుగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో ప్రయాస్ పేరిట సరికొత్త కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమాల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ హైదరాబాద్) శాస్త్రవేత్త ప్రొఫెసర్ వి.జయతీర్థఆరవు మాట్లాడుతూ హృద్రోగ సంబంధమైన సమస్యలపై తాము గత 30 ఏళ్లుగా పరిశోధనలు జరుపుతున్నామన్నారు.

ఫాస్ఫోడిస్టైరేజ్-3 (పీడీఈ-3) ద్వారా గుండె పోటు, ఇతర సమస్యలకు మరింత మెరుగైన చికిత్సఅందించవచ్చునన్నారు. జర్మనీ శాస్త్రవేత్తలతో తాము జరిపిన పరిశోధనలు విజయవంతమయ్యాయన్నారు. పీడీఈ-3 వాడకం వల్ల హృద్రోగులకు స్టంట్లు వేయవలసిన అవసరం ఉండదని, ఇందుకు సంబంధించి జంతువులపై జరిపిన ప్రయోగాలు విజయవంతమవ్వడంతో సైడ్ ఎఫెక్ట్‌లపై ప్రసుతం క్లినికల్ పరీక్షలు జరుపుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

భీమునిపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి వెంకటగిరిపై కొలువుదీరిన శ్రీపద్మావతి, గోదా సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం వేకువజామున శ్రీవారికి సుప్రభాత సేవ, ప్రభాత ఆరాధనలు జరిపాక ఉదయం 9 గంటల నుంచి వాస్తు యోగీశ్వర, లక్ష్మీనారాయణ మండప ఆవాహనం పతాక ప్రతిష్ఠ నిర్వహించారు. అష్టదిక్పాలక ఆవాహనం, ధ్వజారోహణం జరిపారు. సాయంత్రం నిత్య ఆరాధన, విశేష హోమాలు, ఎదుర్కోలు ఉత్సవం జరిపాక శ్రీవారి కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. రాత్రి మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు శ్రీవారి కల్యాణాన్ని తిలకించారు. ఆలయ సంక్షేమ సంఘం నాయకులు గాడు అప్పలనాయుడు, రేలంగి పెదబాబు, ఎం.సత్యానందం, కె.ముత్యాలరావు, జి.సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైసీపీ ఫీజు పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ

ఆనందపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): భీమిలి నియోజకవర్గంలో కార్యకర్తలకు అండగా ఉంటానని వైసీపీ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. సోమవారం గుడిలోవ సమీపంలో మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశమై ఫీజు పోరుబాట పోస్టర్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్, ఇతర నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా తోడుగా ఉంటానని భరోసా ఇచ్చారు. వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి నమ్మకాన్ని నిలబెడదామన్నారు. గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీ శ్రేణులు ముందుండాలన్నారు. నాయకులు కరణం ధర్మశ్రీ, మజ్జి వెంకటరావు, బంక సత్యనారాయణ, కోరాడ వెంకటరావు, పాండ్రంకి శ్రీను, గంరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అమర్‌నాథ్, ధర్మశ్రీ, మజ్జి శ్రీనివాస్, తదితరులు



పరీక్షల సామగ్రితో విద్యార్థులు, తదితరులు

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ఆనందపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిడిజాల జడ్పీ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోని పదో తరగతి విద్యార్థులకు సోమవారం పరీక్షల సామగ్రిని పంపిణీ చేశారు. టీడీపీ స్థానిక నాయకుడు కోరాడ వైకుంఠరావు, వృక్ష ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాకర సురేశ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీమహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ అధినేత ఘట్టమనేని సుభాశ్ చంద్రబోస్, సీఐ చింతా వాసునాయుడులు హాజరై వాటిని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులంతా పరీక్షలు బాగా రాసి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి సత్య లావణ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ కోరుకొండ శివాజీ, మేముసైతం వ్యవస్థాపక అధ్యక్షుడు దేముడుబాబు, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం: ఇక్కడి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సామగ్రిని ఎంపీపీ కె.రాంబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి భయాలకు గురి కాకుండా అందరూ ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ, తదితరులు పాల్గొన్నారు.

బింద్రానగర్ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ



ఆలయంలోకి గోమాతను తెస్తున్న దృశ్యం

మధురవాడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 7వ వార్డు పరిధి బింద్రానగర్‌లో మహా గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, ఏకశిల నాగాభరణ, పరమేశ్వర, నూకాంబిక విగ్రహాలను వైభవంగా ప్రతిష్ఠించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. దార్లపూడి సీతారామశర్మ ఆధ్వర్యంలో రుత్వికులు యంత్ర విగ్రహ, పూర్ణకలశ ప్రతిష్ఠ చేశారు. అనంతరం పూర్ణాహుతి, అమ్మవారి దర్పణ దర్శనం, తదితర పూజాది కార్యక్రమాలను చేపట్టారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

దుర్గాంబికకు పంచామృతాభిషేకాలు

కొమ్మాది, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కొమ్మాది జంక్షన్ సాయిరాం కాలనీలో శ్రీదుర్గాంబికా జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.గోవిందరావు ఆధ్వర్యంలో అఖండ దుర్గా హోమం జరిపారు. అమ్మవారిని ఐదో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత దంపతులు, టీడీపీ సీనియర్ నాయకుడు మొల్లి లక్ష్మణరావుతో పాటు అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ప్రణాళికాబద్ధంగా పట్టణాల అభివృద్ధి

సదస్సులో గీతం వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ ఎరోల్ డిసౌజా

సాగర్‌నగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణాలకు వలస రావడంతో అక్కడ జనాభా పెరుగుతోందని, 2060 నాటికి భారతదేశంలో 70 శాతం మంది పట్టణాల్లో నివసించే పరిస్థితి ఏర్పడబోతోందని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ ఎరోల్ డిసౌజా పేర్కొన్నారు. ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పట్టణాల అభివృద్ధి జరగాలని సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన సూచించారు. పెరుగుతున్న పట్టణ జనాభా అవసరాలు తీర్చేలా ఆర్థిక వనరులు లేకపోవడంతో అక్కడ సమస్యలు నెలకొంటున్నాయని ఆయన పేర్కొన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డీన్ డాక్టర్ విభూతిసచ్చదేవ్, విశాఖపట్నం సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు సోహన్ హట్టంగడి తమ ప్రసంగాలలో విశాఖ వంటి నగరాలను అభివృద్ధి చేసే క్రమంలో పర్యావరణ అంశాలు, ప్రాచీన వారసత్వ కట్టడాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. అటవీ మంత్రిత్వ శాఖ అనుబంధ విభాగం సెంటర్‌ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ డైరక్టర్ సుజీత్‌కుమార్ డోంగ్రే తన ప్రసంగంలో తీర ప్రాంత పరిరక్షణ అంశాల ప్రాధాన్యతను వివరించారు. ఇన్‌క్యూబిస్ వ్యవస్థాపకుడు అమిత్‌కృష్ణ గులాటి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ క్రాఫ్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ రేణుకారాణి, థాన్ ఫౌండేషన్ పర్యావరణ ఇంజనీర్ ఎస్.లోకేష్ తదితరులు ప్రసంగించారు.

విజ్ఞాన పరిశోధనల్లో అద్వితీయ కృషి

కొమ్మాది, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విజ్ఞానశాస్త్ర పరిశోధనలో భారతీయుల కృషి అద్వితీయమైనదని రసాయన శాస్త్రవేత్త వి.జయతీర్థారావు అన్నారు. సోమవారం కొమ్మాది జవహర్ నవోదయ విద్యాలయంలో విద్యార్థులకు దృశ్య, శ్రవణ మాధ్యమాల ద్వారా విజ్ఞానశాస్త్ర విషయాలను వివరించారు. ఖగోళశాస్త్రం, ఆయుర్వేదం, గురుత్వాకర్షణశక్తి, గ్రహగతులు వంటి అనేక అంశాలు ప్రపంచానికి అందించటంలో ఆర్యభట్ట, సుశృత, భాస్కరాచార్య వంటి శాస్త్రవేత్తలు ప్రముఖ పాత్ర పోషించారని తెలిపారు. గణితశాస్త్రంలో సున్నాను కనిపెట్టి పరిపూర్ణత సాధించిన ఘనత కూడా మనదేనని తెలిపారు. విద్యార్థి దశ నుంచే ప్రశ్నించటం, ఆలోచించటం ప్రారంభించాలని సూచించారు. అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, జర్మనీ దేశాలకు చెందిన పలు విశ్వవిద్యాలయాల్లో బోధిస్తూ విశేష కృషి చేస్తున్న జయతీర్థారావు నవోదయ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించటం గొప్పవిషయమని ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ అన్నారు. అనంతరం అతిథిని నవోదయ సిబ్బంది ఘనంగా సత్కరించారు.

విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి

కొమ్మాది, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులందరూ నైపుణ్యాలను మెరుగుపరుచుకుని పరిశోధనలపై అవగాహన కలిగివుండాలని విశాఖపట్నం సీటెక్ పీఎల్ వైస్ ప్రెసిడెంట్ ఎంఏపీ రాజు అన్నారు. సోమవారం పీఎంపాలెం బాబా ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో మైటీ వెల్డర్స్ పేరిట ఐదు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. కళాశాల కార్యదర్శి శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం రోబోల యుగం నడుస్తుందని, రోబో తయారీ వెనక మెకానికల్ విద్యార్థుల నైపుణ్యాన్ని, అవసరాన్ని గుర్తించాలని కోరారు. గౌరవ అతిథి జేఎన్‌టీయూ అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ సి.నీలిమాదేవి మాట్లాడుతూ పరిశ్రమల రివల్యూషన్ 18వ శతాబ్దంలో మొదలైందని, బొగ్గు, కరెంటు లైన్స్, కంప్యూటర్స్, ఆటోమొబైల్ యంత్రాలు, నానో టెక్నాలజీ, తదితరమైనవి ఈ క్రమంలో వచ్చినవేనన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పూర్ణ సత్యనారాయణరావు, గీతం రీసోర్స్ పర్సన్ లక్ష్మి, ఉమాచైతన్య, తదితరులు పాల్గొన్నారు.

హయగ్రీవకు ఝలక్

... 5వ పేజీ తరువాయి

చెల్లుబాటు కావడంతో ఎంవీవీ సత్యనారాయణ తెర వెనుక అంతా నడిపించారు. అనుమతులు లేకుండానే పనులు చేపట్టారు. ప్లాట్లు అమ్మేశారు. అధికారులు అనుమతులు ఇవ్వకపోతే కోర్టుకు వెళ్లి నిబంధనల ప్రకారం చేస్తామని చెప్పి ఉత్తర్వులు తెచ్చుకున్నారు. కలెక్టర్ మూడేళ్లలో నిర్మాణం పూర్తిచేయాలని చెబితే ఐదేళ్లయినా చేయలేకపోయారు. హయగ్రీవ ప్రాజెక్టుపై గత ఐదేళ్లు అధికారులకు, ఎంవీవీకి, ఆడిటర్ జీవీలకు మధ్య పెద్ద యుద్ధమే జరిగింది. విచిత్రం ఏమిటంటే... వృద్ధులకు పది శాతం భూమిలోనే ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆ పది శాతం పూర్తి చేయడానికి వారికి ఐదేళ్లు సరిపోలేదు. మిగిలిన భూమిని వాణిజ్యపరంగా లాభదాయకంగా మార్చుకోవడంపైనే వారు దృష్టిపెట్టారు. మంచి లొకేషన్‌లో ఉండడంతో నగరంలోని ధనవంతులు, రాజకీయ నాయకులు కోట్ల రూపాయలు పెట్టి వాటిని కొనుగోలు చేశారు. ఈ నేపథ్యంలో జగదీశ్వరుడు రెండేళ్ల క్రితం 'సెల్ఫీ వీడియో' విడుదల చేశారు. తనకు ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ఆయనపై వైసీపీ హయాంలో లెక్కలేనన్ని కేసులు పెట్టించారు.

ఎవరికి వారు పోరాటం

ప్రభుత్వ భూమిలో వ్యాపారం సహించలేని విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. అనేకసార్లు అసెంబ్లీలో ప్రస్తావించారు. భూమిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశారు. అంతకు ముందు ప్రజా పద్దుల సంఘం కూడా ఈ భూమిని తక్కువ ధరకు ఇచ్చారని ఆక్షేపించింది. అనేక ఉల్లంఘనలు, తప్పులు జరగడంతో ప్రభుత్వం ఆ భూమిని వెనక్కి తీసుకోవాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

ఇవి గుర్తుంచుకోవాలి

నగరంలో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రజాసేవ ముసుగు వేసుకొని తప్పుడు పనులు చేస్తున్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించి, కబ్జా చేసి ప్రాజెక్టులు చేపడుతున్నారు. వాటిలో ఏది కొన్నా ప్రజలు నిండా మునిగిపోవలసిందే. ఇప్పుడు ప్రభుత్వం నిబంధనలను కఠినంగా అమలు చేస్తోంది. ఎన్ని దశాబ్దాల తరువాతైనా ప్రభుత్వ భూమిని వెనక్కి తీసుకునే అవకాశం ఉంది. కాబట్టి ఇలాంటి తప్పుడు పనులతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే వారి దగ్గర ఏది కొన్నా భవిష్యత్తులో చిక్కులు తప్పవు. కాబట్టి తస్మాత్ జాగ్రత్త. కొంటే మునిగిపోవడమే. కాపాడేవారే ఉండరు.

ఏప్రిల్ 1 నుంచే ఇంటర్ తరగతులు

... 5వ పేజీ తరువాయి

వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఈ క్లాసులు మొదలుపెట్టనున్నారు. ఏప్రిల్ 7 నుంచి ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించానున్నారు. పదో తరగతి పరీక్ష రాసిన ప్రతి విద్యార్థి ఇంటర్ మొదట సంవత్సరంలో అడ్మిషన్ తీసుకోవచ్చు. ఏప్రిల్ 23 వరకు క్లాసులు, ప్రవేశాలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 24 నుంచి జూన్ 1 వరకు సెలవులు ప్రకటించారు. మళ్లీ జూన్ 2 నుంచి యథావిధిగా క్లాసులు ప్రారంభమవుతాయి. దీనివల్ల ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు మెరుగుపడే అవకాశం ఉందంటున్నారు. ఏప్రిల్ 1 నుంచి 23 వరకు నిర్వహించే తరగతుల్లో 15 శాతం సిలబస్ పూర్తిచేస్తారు. మొత్తం సిలబస్‌ను కూడా డిసెంబరు 31 తేదీకంటే ముందే పూర్తి చేసి రివిజన్ ప్రారంభిస్తారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న సైన్స్ గ్రూపు విద్యార్థులకు జేఈఈ, ఎంసెట్‌లకు శిక్షణ ఇవ్వాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అకడమిక్ తరగతులు నిర్వహించి, 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జేఈఈ, ఎంసెట్ శిక్షణ కల్పించనున్నారు.

విశాఖ ఉమ్మడి జిల్లాలో 68 సాంఘిక, గిరిజన సంక్షేమ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో ఏటా దాదాపు 13 వేల మంది విద్యార్థులు చేరుతుంటారు. వచ్చే నెల నుంచే ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ మొదలుపెట్టడం వల్ల విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని అధ్యాపకులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ ప్రవేశాల్లో టెన్త్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కొనసాగించి ఫెయిలైన వారికి తొలగిస్తారు.

లాడ్జిల్లో ఆకస్మిక తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

కలిగి ఉన్నారా?, లేదా?, మైనర్లు ఎవరైనా గదుల్లో బస చేశారా?, హోటల్‌కు అన్నిరకాల అనుమతులు ఉన్నాయా?...అనే అంశాలపై ప్రధానంగా దృష్టిసారించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ అనుమతులు లేని హోటళ్లు/లాడ్జిలు 42, ట్రేడ్ లైసెన్స్‌లు లేనివి 12, ఫుడ్‌లైసెన్స్ లేనివి 12, జీఎస్టీ సర్టిఫికెట్ లేనివి 17, సందర్శకుల రికార్డులు నిర్వహించనవి రెండు, వీఎంఎస్ అప్‌డేట్ చేయనవి 14, సీసీ టీవీలు లేనివి రెండు ఉన్నట్టు గుర్తించారు. వీటిపై చట్టపరంగా కేసులు నమోదుచేసి చర్యలు తీసుకుంటామని సీపీ శంఖబ్రతబాగ్చి ఒక ప్రకటనలో తెలిపారు.

వైసీపీ నేత బరితెగింపు

... 5వ పేజీ తరువాయి

ఆక్రమణలు ఉంటే తొలగించాలని పెదగంట్యాడ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఇటీవల పెదగంట్యాడ రెవెన్యూ అధికారులు అక్కడకు వెళ్లి ప్రభుత్వ భూమిని ఆక్రమించి కల్యాణ మండపం నిర్మిస్తున్నట్టు నిర్ధారించి తొలగింపునకు శ్రీకారం చుట్టారు. ఆక్రమణల తొలగింపు నిలుపు చేయాలని వైసీపీ నేత కుమారుడు రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. అదే సమయంలో కూటమికి చెందిన ఒక ప్రజాప్రతినిధి నుంచి కూడా రెవెన్యూ అధికారులకు ఒత్తిడి రావడంతో అక్కడ నుంచి వెనుతిరిగినట్టు ఆ శాఖ అధికారులే చెబుతున్నారు. ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన ప్రజా ప్రతినిధులు, అధికారులు అందుకు విరుద్ధంగా ఆక్రమణదారులకు అండగా నిలవడంపై సర్వతా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పోలీస్ శాఖలో పదోన్నతులు, బదిలీలు

... 5వ పేజీ తరువాయి

హెడ్‌కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న నలుగురికి ఏఎస్‌ఐలుగా పదోన్నతి కల్పించారు.

34 మందికి బదిలీ

నగర పోలీస్ కమిషనరేట్‌లో కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్, ఏఎస్‌ఐలుగా పనిచేస్తున్న 34 మందిని ఇతర స్టేషన్లకు బదిలీ చేస్తూ సోమవారం సీపీ ఉత్తర్వులు జారీచేశారు. వీరిలో ముగ్గురు ఏఎస్‌ఐలు, 20 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 11 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు.

చేజారిన ప్రభుత్వ స్థలం

... 5వ పేజీ తరువాయి

సంగీత్‌మాధుర్ వద్ద ప్రస్తావించగా కోర్టు డిక్రీపై అప్పీలు చేస్తామన్నారు. కె.నగరపాలెం, కాపులుప్పాడ, మంగమారిపేటలో సర్వే నంబరు 296/4 సీ, 298/6 నుంచి 9లో 1.57 ఎకరాలు ప్రభుత్వభూమి ఉందని స్పష్టంచేశారు. కోర్టు నుంచి వచ్చిన సమన్లు అధికారులకు అందకపోవడంపై విచారణ చేపడతామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 2 అర్జీలు

భీమునిపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ భీమిలి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజీఆర్‌ఎస్) కార్యక్రమానికి రెండు అర్జీలు అందాయి. జడ్సీ ప్రసన్నవాణి ఆయా అర్జీలను స్వీకరించి సంబంధిత ఇంజనీరింగ్ విభాగానికి అందజేశారు. త్వరితంగా ఆయా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

16న మెగా రక్తదాన శిబిరం

భీమునిపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): భీమిలి నీడీ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. స్థానిక సన్ స్కూల్ ఆవరణలో ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల శిబిరం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గల రక్తదాతలు 9866441140, 8500264289 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

భీమునిపట్నం (రూరల్) మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో విస్తారంగా పండుతున్న మొక్కజొన్న కొనుగోలుకు ప్రభుత్వపరంగా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. మండలంలోని తాళ్లవలస, మజ్జివలస, లక్ష్మీపురం, సింగనబంద, కృష్ణంరాజుపేట, తదితర ప్రాంతాల్లో చాలామంది రైతులు మొక్కజొన్నను సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో తీపి జొన్న (స్వీట్ కార్న్) కాకుండా దాణాకు ఉపయోగపడే సాధారణ మొక్కజొన్నను రైతులు పండిస్తున్నారు. ప్రతి సంవత్సరం సుమారు వెయ్యి నుంచి రెండు వేల బస్తాల దిగుబడి వస్తోంది. ఏటా కొంత మంది ప్రైవేటు వ్యాపారులు రైతులకు ముందుగా మదుపులు, పెట్టుబడులు అందించి వారి నుంచి చౌకగా మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నారు. కానీ ఈ ఏడాది వ్యాపారస్తులంతా సిండికేట్‌గా ఏర్పడి బస్తాకు రెండు వేల రూపాయలను మాత్రమే ధర నిర్ణయించడం వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బస్తా ధర ఇంత తక్కువ మొత్తంగా ఉంటే పెట్టుబడి కూడా రాని ఈ పరిస్థితి ఉంటుందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పండిన పంటను ఎలా అమ్ముగలమని వారు వాపోతున్నారు. ప్రభుత్వపరంగా మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ధరను నిర్ణయిస్తే తమకు ఎంతో అనుకూలంగా ఉంటుందని వారంటున్నారు. అందువల్ల ఇక్కడ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు: తహసీల్దార్


పాల్ కిరణ్ తహసీల్దార్

ఆరిలోవ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చినగదిలి తహసీల్దార్ పాల్‌కిరణ్ హెచ్చరించారు. ముడర్లోవ సర్వే నంబరు 15/12లో కొంతమంది ప్రభుత్వ భూమిని ఆక్రమించి అందులో బోరు బావిని తవ్వడంతో స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసీల్దార్ మాట్లాడుతూ ఈ సర్వే నంబరులో కొండ పోరంబోకు ప్రభుత్వ స్థలమని, ఆక్రమణలను సహించమన్నారు. సుమారు 700 గజాల స్థలం ఆక్రమించుకుని, బోరు వేసినట్టు సిబ్బంది నిర్ధారించారన్నారు. పనులను అడ్డుకుని, కలెక్టర్‌కు నివేదించామన్నారు. ఈ ప్రాంతంలో సుమారు మూడు ఎకరాల ప్రభుత్వ స్థలముందని, దానిని పరిరక్షిస్తామన్నారు.

వీసీని కలిసిన ఐఐపీఏ సభ్యులు

వెంకోజీపాలెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ వైజాగ్ లోకల్ బ్రాంచ్ కమిటీ సభ్యులు, చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.సుదర్శనరావు, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్.సాంబశివరావు, కార్యదర్శి ప్రొఫెసర్ పి.ప్రేమానందం, కోశాధికారి డాక్టర్ హరిబాబులు ఏయూ వీసీ ప్రొఫెసర్ జి.పి.రాజశేఖర్‌ను కలిసి అభినందించారు. స్థానిక శాఖ కార్యకలాపాల గురించి వీసీకి వివరించారు.

బీఈడీ మూల్యాంకన కేంద్రం పరిశీలన

వెంకోజీపాలెం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఏయూ పరిధిలోని బీఈడీ జవాబు పత్రాల మూల్యాంకనం జరుగుతున్న కేంద్రాన్ని రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయ్‌రావు సోమవారం పరిశీలించారు. విశాఖ, విజయనగరం జిల్లాల్లోని 57 కళాశాలల బీఈడీ మొదటి సంవత్సరం విద్యార్థుల జవాబు పత్రాలను ఇక్కడ మూల్యాంకనం చేస్తున్నారు. ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య డి.నగరాజకుమారి,ఆచార్య టి.షారోన్‌రాజు పాల్గొన్నారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులను ఆదుకోవాలి

సిరిపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు రూ.4వేలు పెన్షన్ ఇవ్వాలని ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి ఏవీ రావు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వీవీకే రాయ్, ఉపాధ్యక్షులు సీహెచ్ పైడిరాజురెడ్డి, బొడ్డేటి జగత్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. పెన్షన్ పెంచాలని కోరుతూ ఈనెల 14న చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమం విజయవంతం చేయాలని నినాదాలు చేశారు. 14న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వినతి పత్రం అందజేస్తామన్నారు.

సినిమా గైడ్

- **శబ్దం:** సంగం, శారద, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక),
- **మజాకా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
- **డ్రాగన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
- **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ(గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడీ, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడీ, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 28, టమాటా 14, వంకాయలు(తెలుపు) 24, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 44, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 44, బీరకాయలు 50, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 12, క్యారెట్ 28 దొండకాయలు 40, బంగాళ దుంపలు 15, అరటికాయ 6, మునక్కాడలు (కిలో) 60, అల్లం 50, బరబాటి 36, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 44, దోస కాయలు 26, వె ల్లుల్లి (పెద్దవి) 90, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 46, కీరదోస 26, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 34 చిలగడదుంపలు 42, కంద 64, దేముడు చిక్కుడు 58, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419


చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	78
లైవ్ ధర	98
విత్ స్కిన్	166
స్కిన్‌లెస్	176

తిరుమలనగర్ కాలనీ సమస్యలను పరిష్కరిస్తాం

- ఖాళీ స్థలం చుట్టూ ప్రహరీని నిర్మిస్తాం
- భూగర్భ జలాలు కలుషితం కాకుండా చూస్తాం
- 'పాలిమర్స్' వద్ద సెల్ టవర్‌ను తొలగిస్తాం
- వాయు, శబ్ద కాలుష్య నివారణకు చర్యలు చేపడతాం
- ఐలా కమిషనర్ కిశోర్


ఐలా కమిషనర్ కిశోర్‌కు సమస్యలను వివరిస్తున్న కార్పొరేటర్, తిరుమలనగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు



కూర్మన్నపాలెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమలనగర్‌ను ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో వ్యర్థాలు వేయకుండా తగిన చర్యలుతీసుకుంటామని, ఆ స్థలం చుట్టూ ప్రహరీని నిర్మిస్తా మని కాలనీవాసులకు ఐలా కమిషనర్ కిశోర్ హామీ ఇచ్చారు. ఇండస్ట్రియల్ రసాయన వ్యర్థాల వల్ల భూగర్భ జలాలు కలుషితం కాకుండా చర్యలు చేపడతామన్నారు. తిరుమల నగర్ వాసవి కల్యాణ మండపంలో ఇటీవల 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన 'అక్షరం అండగా-పరిష్కారమే అజెండాగా' ప్రత్యేక కార్యక్రమంలో స్థానికులు వివరించిన సమస్యలకు ఐలా కమిషనర్ స్పం దించి సోమవారం గాజువాక పారిశ్రామికవాడ, తిరుమలనగర్ ప్రాంతాల్లో పర్యటించారు. అనధికార డంపింగ్ యార్డును పరిశీలించడంతో పాటు భూగర్భ జలాలు కలుషితమవుతున్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బొండా జగన్నాథం ఇక్కడి సమస్యలను వివరిస్తూ.. పారిశ్రామికవాడకు సంబంధించిన డ్రైనేజీ వ్యవస్థ తిరుమలనగర్ రోడ్డు నంబర్-7 డ్రైనేజీకి కనెక్టై ఉందని, దీనివల్ల వివిధ రసాయనిక పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థ జలాలు డ్రైనేజీ ద్వారాతిరుమలనగర్ డ్రైనేజీలోకి వచ్చేస్తున్నాయని, దీనిని నియంత్రించాలని కోరారు.

అదేవిధంగా ఆటోనగర్ శివబాలాజీ పాలిమర్స్‌లో ఏర్పాటు చేసిన సెల్ టవర్‌ను తొలగించాలని, రోడ్డు నంబర్-9బీ వైపు పాలిమర్ ఇండస్ట్రీ గేట్లను మూసివేయాలని, ఆటోనగర్‌లోని స్టీల్ ఇండస్ట్రీస్, గ్రానైట్ ఇండస్ట్రీస్ నుంచి వచ్చే శబ్ద కాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఐలా కమిషనర్ కిశోర్ సెల్ టవర్‌ను సత్వరమే తొలగిస్తామన్నారు. ఆటోనగర్ పరిశ్రమల వ్యర్థ జలాలు తిరుమలనగర్ కాలనీ డ్రైనేజీల్లోకి రాకుండా చర్యలు చేపడతామని, ఇందుకు సంబంధించి ఇంజనీరింగ్ అధికారులతో ఒక ప్రణాళికను రూపొంది స్తామన్నారు. ఆటోనగర్ నుంచి శబ్ద, వాయు కాలుష్యం వెలువడకుండా చర్యలు తీసుకుంటామని, అవసర మైతే కాలుష్య నియంత్రణ మండలి అధికారుల సహాయం తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తిరుమలనగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమానందం, టీడీపీ వార్డు అధ్యక్షుడు రాజన్‌రాజు, స్థానిక నాయకులు పి.దానయ్య, ఆనందకుమార్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైసీపీ నాయకులు

మద్దిలపాలెం, మార్చి10 (ఆంధ్రజ్యోతి): మహిళల హక్కుల కోసం పోరాటం చేసిన సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకుని మహిళలు తమ హక్కుల సాధనకు ఉద్యమించాలని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ పిలుపునిచ్చారు. సావిత్రీబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషిచేసిన మహోన్నత వ్యక్తి సావిత్రీబాయి పూలే అన్నారు. మహిళలకు విద్యతోనే విముక్తి కలుగుతుందని బాలికల పాఠశాల ఏర్పాటు చేసిన ఆదర్శమూర్తిగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లపల్లి సుభద్ర, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, పేడాడ రమణికుమారి తదితరులు పాల్గొన్నారు.

ఏయూ విద్యావిభాగంలో

వెంకోజీపాలెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఏయూ విద్యావిభాగంలో సావిత్రీబాయి పూలే వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళల విద్య, సమాజసేవ, సమానత్వ ఉద్యమాలకు మార్గదర్శకురాలిగా సావిత్రీబాయి పూలే నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పత్రాల అందజేత


నిధుల మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తీవ్ర అనారోగ్యం కారణంగా చికిత్స కోసం లాసన్స్‌బే కాలనీకి చెందిన కాసా సుధాకర్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.6లక్షలు మంజూరయ్యాయి. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు వినతి మేరకు మంజూరైన పత్రాలను బాధితునికి ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేశారు.

జీవీఎంసీ కమిషనర్‌ను వెంటనే నియమించాలి

- సీపీఐ, సీపీఎం కార్పొరేటర్ల ధర్నా



ధర్నా చేస్తున్న కార్పొరేటర్లు

విశాఖపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కమిషనర్ పోస్టును తక్షణం భర్తీచేయాలని కోరుతూ సీపీఐ, సీపీఎం కార్పొరేటర్లు ఏజే స్టాలిన్, బి.గంగారావు జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. రాష్ట్రంలోనే అతిపెద్ద నగరపాలక సంస్థ జీవీఎంసీకి రెండు నెలలుగా కమిషనర్ లేకపోవడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కమిషనర్‌గా పి.సంపత్‌కుమార్‌ను నియమించారని, ఆరు నెలలు తిరగకుండానే అతన్ని బదిలీచేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. సంపత్‌కుమార్ నగరంపై అవగాహన ఏర్పరచుకుని అభివృద్ధి దిశగా నడిపే ప్రణాళికలు అమలుచేస్తున్న సమయంలో బదిలీచేయడం, ఆయన స్థానంలో వేరొకరని నియమించకపోవడం నగరాభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. వేసవి సీజన్ ప్రారంభమైనందున నగరంలో తాగునీటి కష్టాలు పెరిగే ప్రమాదం ఉందని, ఈ సమయంలో తగిన నిర్ణయాలు తీసుకోవాల్సిన కమిషనర్ లేకపోవడంతో ఇన్‌చార్జి కమిషనర్ తక్షణ నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం ఉండదన్నారు. స్వచ్ఛసర్వేక్షణ్ సర్వే జరుగుతున్నందున నగరం ర్యాంక్ దిగజారిపోయే అవకాశం ఉందని, ఇప్పటికైనా కమిషనర్ పోస్టుని భర్తీచేయాలని కోరారు.

వినతులకు గడువులోగా పరిష్కారం చూపాలి

- వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

సిరిపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన వినతులను గడువులోగా పరిష్కరించాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కేఎస్‌విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. వీఎంఆర్డీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి పలువురు వినతులు అందజేశారు. ఆయా అంశాలపై సంబంధిత అధికారులకు వివరించి సత్వరమే పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు. ప్రైవేట్ లేవుట్‌లకు చెందిన ప్లాట్‌ల విషయంలో వచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఒకసారి వచ్చిన ఫిర్యాదు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. కార్యక్రమానికి మొత్తం 16 ఫిర్యాదులు రాగా పరిపాలన విభాగానికి 4, ప్లానింగ్ 11, 1 రెవెన్యూకు సంబంధించి అందాయి. జేసీ కె.రమేష్, చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్ప, చీఫ్ ఇంజనీర్ వినయ్‌కుమార్, కార్యదర్శి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న మేయర్ హరివెంకట కుమారి


ఫిర్యాదులు స్వీకరిస్తున్న వీఎంఆర్డీఏ చైర్మన్, కమిషనర్

జీవీఎంసీకి 940 వినతులు

వెంకోజీపాలెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 90 వినతులు వచ్చాయని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తితో కలిసి నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పీఆర్‌జీఎస్‌లో వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలన్నారు. అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ, ప్రధాన ఇంజనీర్ పి.శివప్రసాద్ రాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎస్.వినరేష్‌కుమార్ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పైడిమాంబ ప్రధాన పండగ



ఆరిలోవ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఆదర్శనగర్ కూడలిలోని పైడిమాంబ అమ్మవారి ప్రధాన పండగ మంగళవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. పండగ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ సందర్భంగా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి రవీంద్రనగర్ కూడలి నుంచి భారీ ఊరేగింపు నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ మీసాల రాంబాబు తెలిపారు.

కేతన్‌రెడ్డికి ఉత్తమ పరిశోధన పత్రం


కేతన్‌రెడ్డిని అభినందిస్తున్న ఏయూ రిజిస్ట్రార్

వెంకోజీపాలెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఏయూ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ రెండో సంవత్సరం విద్యార్థి ఆళ్ల కేతన్‌రెడ్డికి ఉత్తమ పరిశోధన పత్రం లభించింది. ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్, బాలాసోర్, ఒడి శా డీఆర్‌డీవో నిర్వహించిన ఐఈఈఈ సదస్సులో పురస్కారాన్ని అందుకున్నారు. ఆచార్య సి.ప్రవీణ్‌బాబు ఆధ్వర్యంలోజరిపిన పరిశోధనలో ఎలక్ట్రానిక్ ఆడియో తరంగాల్లోని అనవసర శబ్దాలను తొలగించడానికి డినోయిసింగ్ సాంకేతికతను కేతన్‌రెడ్డి రూపొందించారు. రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు, కేతన్‌రెడ్డి అభినందించారు.

తెలుగు రాష్ట్రాల్లో నాట్స్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

- సన్ ఫ్లవర్ స్కూల్‌కు రూ.20 లక్షలు ఆర్థిక సాయం
- నార్త్ అమెరికా తెలుగు సంఘం (నాట్స్) ప్రెసిడెంట్ మదన్ పాములపాటి

విశాఖపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో విభిన్నమైన సామాజిక సేవా కార్యక్రమాలను నార్త్ అమెరికా తెలుగు సంఘం (నాట్స్) నిర్వహిస్తోందని నాట్స్ ప్రెసిడెంట్ మదన్ పాములపాటి పేర్కొన్నారు. సోమవారం పెదవాల్తేరులోని సన్ ఫ్లవర్ విభిన్న ప్రతిభావంతుల స్కూల్‌కు రూ.20 లక్షలు బస్ కొనుగోలుకు నాట్స్ అందించింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రెండేళ్లకు ఒకసారి అమెరికాలో నాట్స్ కన్వెన్షన్ పేరుతో తెలుగు సంబరాలు నిర్వహిస్తామని, తెలుగు భాష ఔన్నత్యాన్ని, సంస్కృతి సాంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు తెలియజేసేలా విభిన్న కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ప్రధానంగా విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారిత, మంచి నీటి సౌకర్యాల కల్పనకు విశేష కృషి చేస్తోందన్నారు. నాట్స్ ఇండియా కో-ఆర్డినేటర్, గౌతు లచ్చన్న బలహీన వర్గాల సంస్థ (గ్లో) ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకన్న చౌదరి యార్లగడ్డ మాట్లాడుతూ నాట్స్ కన్వెన్షన్ నిర్వహించగా మిగిలిన రూ.2.5 కోట్లలో రూ.కోటిని రాష్ట్రంలోని వివిధ సంస్థలు నిర్వహించే సేవా కార్యక్రమాలకు అందించారన్నారు. ఇందులో భాగంగా సన్‌ఫ్లవర్ స్కూల్‌కు రూ.20 లక్షలు, హోప్ ఫర్ లైఫ్ సంస్థకు రూ.20 లక్షలు, వనవాసి కల్యాణి గిరిజన సంస్థకు రూ.26 లక్షలు, గ్లో సంస్థకు రూ.20 లక్షలు అందించారన్నారు. విభిన్న ప్రతి భావంతులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తు న్న ఈ సంస్థకు సహకరించడం గొప్ప విషయమన్నా రు. నాట్స్ చైర్మన్ ప్రశాంత్ పిన్నమనేని మాట్లాడుతూ మాతృభూమికి సేవచేసే ఉద్దేశంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఎవల్యూట్ సంస్థ వ్యవస్థాపకులు అరసాడ శ్రీనివాస్ మాట్లాడుతూ తన వంతుగా ఈ సంస్థకు రూ.10 లక్షలు అందించడం ఆనందంగా ఉందన్నారు.



సన్‌ఫ్లవర్ స్కూల్‌కు రూ.20 లక్షల చెక్కు అందిస్తున్న మదన్, తదితరులు

నాట్స్ కార్యక్రమాల్లో భాగస్వామి కావడం గర్వంగా ఉందన్నారు. నాట్స్ ఎలక్ట్ ప్రెసిడెంట్ శ్రీహరి మందడి మాట్లాడుతూ సమాజానికి సేవ చేసే ఉద్దేశంతో నాట్స్ పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కన్వెన్షన్ కన్వీనర్ శ్రీనివాస్ గుత్తికొండ, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ శ్రీనివాస్ పిడికిటి, గత ఈసీ సభ్యులు సురేష్ బొల్లు, సన్‌ఫ్లవర్ స్కూల్ వ్యవస్థాపకులు ఎం.నాగరాజకుమారి, సంస్థ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గంటాను కలిసిన పోక్సో కోర్టు ప్రత్యేక పీపీ


రాజశేఖర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా

విశాఖపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పోక్సో న్యాయస్థానం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన న్యాయవాది బత్తి రాజశేఖర్ భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బాధితుల పక్షాన నిలిచి వారికి న్యాయం జరిగేలా కృషిచేయాలని, కొత్త బాధ్యతల్లో విజయవంతంకావాలని గంటా ఆకాంక్షించారు. రాజశేఖర్‌ను శాలువాతో అభినందించారు. పోక్సో న్యాయస్థానంలో దాఖలయ్యే కేసులను ప్రభుత్వం తరఫున ఆయన వాదిస్తారు

విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి


హైకోర్టు సీజేతో విశాఖ బార్ అసోసియేషన్ సభ్యులు

విశాఖపట్నం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని విశాఖ బార్ అసోసియేషన్ ప్రతినిధులు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌ను కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బెవర సత్యనారాయణ ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం విజయవాడలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. విశాఖపట్నంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని, కోర్టు ఆవరణలో పదినెలలుగా మూతపడి ఉన్న క్యాంటీన్ తెరిపించాలని, జిల్లా కోర్టు నూతన భవనానికి ఏసీ సదుపాయం కల్పించాలని కోరారు. ఈ డిమాండ్లకు హైకోర్టు ప్రధానన్యాయమూర్తి సానుకూలంగా స్పందినట్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి నరేష్‌కుమార్, ఉపాధ్యక్షులు ఇమంది శ్రీనివాసరావు, కోశాధికారి అశోక్‌కుమార్ ఉన్నారు.

పక్షులకు నీరు, గింజలు అందుబాటులో ఉంచాలి

మద్దిలపాలెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వేసవిలో పక్షుల ఆకలి, దాహార్తి తీర్చడానికి చర్యలు తీసుకోవాలని గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం కోరారు. మద్దిలపాలెంలోని శ్రీభావన పాఠశాలలో సోమవారం పక్షుల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులందరూ పక్షుల కోసం రోజూ తమ ఇంటి పరిసరాల్లో మట్టి పాత్రల్లో నీటిని పెట్టాలన్నారు. దేశీయ పండ్ల గింజలను ఆరబెట్టి, వేసవి తర్వాత తమ సంస్థకు అప్పగించాలని కోరారు. వంటింటి వ్యర్థాలను ఎరువులుగా మార్చి కూరగాయలు పండించాలని సూచించారు. కాలుష్య కారకాల వినియోగాన్ని నిషేధించి, సహజసిద్ధమైన ఉత్పత్తులు వాడాలన్నారు. అనంతరం పిల్లలకు మట్టిపాత్రలు అందించి పాఠశాలలో పక్షుల కోసం నీటిని నింపించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నీలిమ, సుధారాణి, గ్రీన్ క్లైమేట్ వలంటీర్లు జె.రాజేశ్వరి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

కఠిన చట్టాలతోనే కాలుష్య నియంత్రణ సాధ్యం

వెంకోజీపాలెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): చట్టాలను కఠినంగా అమలుచేస్తేనే కాలుష్య నియంత్రణ సాధ్యమని అమెరికాలోని సెంటర్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫ్ వేస్ట్ టెక్నాలజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ తాత ప్రకాశం అన్నారు. ఏయూ కెమికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఒకరోజు అంతర్జాతీయ వర్క్ షాప్ సస్టైనబుల్ ప్రాక్టీసెస్ ఫర్ ఇండస్ట్రియల్ పొల్యూషన్ కంట్రోల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటి వనరులలోకి రసాయనాలు, కలుషిత పదార్థాలను విడుదల చేయకూడదన్నారు. నదులను పరిరక్షించుకోవాలన్నారు. పర్యావరణ విపత్తులు, ఫలితాలు, వివిధ దేశాలలో ప్రస్తుతం అమల్లో ఉన్న పర్యావరణ చట్టాలను వివరించారు. మన దేశ ప్రజలకు నీటిపై ఉన్న నమ్మకానికి నిదర్శనంగా ఇటీవల జరిగిన కుంభమేళా నీటి విలువను, శక్తిని చాటిందన్నారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ డాక్టర్ పి.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి విభాగాధిపతులు పాల్గొన్నారు.

సైబర్ చట్టాలపై అవగాహన కల్పించాలి

వెంకోజీపాలెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సైబర్ చట్టాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం, న్యాయ కళాశాల నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ అప్డేషన్ ప్రోగ్రాం (ఎఫ్‌యూపీ)ని ఆయన సోమవారం వర్చువల్‌గా ప్రారంభించారు. దేశంలో ప్రతి నిమిషం వందలాది సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. విద్యావంతుల్లోనూ సైబర్ చట్టాల పట్ల అవగాహన కొరవడిందన్నారు. న్యాయ విద్యార్థులు ప్రజలను ఈ దిశగా చైతన్యవంతం చేయాలని సూచించారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం ఆచార్య వి.వల్లికుమారి తదితరులు పాల్గొన్నారు.

రెండు టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

పెదగంట్యాడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా న్యూ పోర్టు పోలీసులు స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుని నుంచి రెండు టన్నుల బియ్యం, ట్రక్కును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గొడ్డువానిపాలేనికి చెందిన వ్యక్తి రేషన్ బియ్యం ఆదివారం ట్రక్కులో రేషన్ బియ్యం లోడ్ చేస్తుండగా.. దాడి చేసి సరకును స్వాధీనం చేసుకున్నారు.

వృద్ధుడి సజీవ దహనం

- విద్యుత్ షార్ట్ సర్క్యూటే కారణం


వెంకటరావు (ఫైల్)

సీతంపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా చెలరేగిన మంటలు ఓ వృద్ధుడి ప్రాణాలను బలిగొన్నాయి. ఈ హృదయవిదారక సంఘటన నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి రైల్వే కొత్త కాలనీ కన్నారావు వీధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కన్నారావు వీధికి చెందిన మండల అదిలక్ష్మి తండ్రి సరగడ వెంకటరావు (80) కుమార్తెతో కలిసి ఆమె ఇంట్లో ఉంటున్నాడు. ఆరేళ్లుగా పక్షవాతంతో బాధపడుతూ మంచంపట్టాడు. వారు నివసిస్తున్న ఇంట్లో ఆదివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు రేగాయి. ఒక్కసారిగా వెంకటరావు ఉంటున్న గదిలోకి పొగలు, మంటలు వ్యాపించాయి. గట్టిగా కేకలు వేయడంతో వృద్ధుడిని రక్షించేందుకు స్థానికుల సహాయంతో చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక శకటం సిబ్బంది మంటలు ఆర్పివేశారు. అయితే గదిలో మంచం మీద ఉన్న వెంకటరావు అప్పటికే సజీవ దహనమయ్యాడు. ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకటరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కవిత పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

పెదవాల్తేరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పల్లంటి ఆదిలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం చినవాల్తేరు లిల్లీ వైట్ క్లబ్‌లో సాహిత్య కర్యక్రమంలో పలు అంశాలపై కవిత పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పలు జిల్లాల నుంచి ఔత్సాహికులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా లయన్ పీవీఆర్ కుమార్ మాట్లాడుతూ ఇలాంటి పోటీలతో సాహిత్యంపై అభిరుచి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఎస్పీ వి.ప్రసాదరావు, డాక్టర్ కేజీ వేణు, లయన్ పేర్ల భాస్కరరావు, లయన్స్ క్లబ్ రీజనల్ చైర్‌పర్సన్ స్వతంత్రకుమార్, లిల్లీ వైట్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 56 మంది ఎంపిక

మద్దిలపాలెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 56 మంది ఎంపికయ్యారు. దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్‌లో ట్రైనీ సూపర్‌వైజర్, గ్రాడ్యుయేట్ అప్రెంటీస్ ఉద్యోగాలకు 200 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిక పరీక్ష నిర్వహించి అర్హత సాధించిన వారిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.జయ మాట్లాడుతూ ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులు పెంపొందించుకోవాలన్నారు. కళాశాలలో నిత్యం జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, దివీస్ ప్రతినిధులు, అధ్యాపకులు పోల ఉమామహేశ్వరరావు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

12, 13 తేదీల్లో చలో ఢిల్లీ

డాబాగార్డెన్స్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : బీసీల సమస్యలపై పోరాడేందుకు ఈ నెల 12, 13 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు అధ్యక్షుడు బి.రమణ తెలిపారు. సోమవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు బీసీల అపరిష్కృత డిమాండ్లను లేవనెత్తేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. సమావేశంలో జీఏ నారాయణరావు, శ్యామ్, నాయుడు, సుందరరావుపాల్గొన్నారు.

మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలి



జామెట్రీ బాక్సులు అందిస్తున్న నవ్య

అక్కయ్యపాలెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు 123 మంది కి ఉషోదయ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు కొయిలాడ నవ్య సోమవారం జామెట్రీ బాక్సులు పంపిణీ చేశారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాస్, ఎ.సునంద్, మాణిక్యం, కిశోర్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

గరిమెళ్ల మృతికి సంతాపం

డాబాగార్డెన్స్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంగీత విద్వాంసుడు, తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన గాయకుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ ఆకాల మృతికి అన్నమయ్య గీతాంజలి ప్రధాన కార్యదర్శి ఎం.వి. రాజశేఖర్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. టీటీడీ ఆస్థాన గాయకునిగా గరిమెళ్ల గానం చేసిన తీరును, సంకీర్తన సేవలను మరిచిపోలేమన్నారు. అన్నమాచార్య సంకీర్తనలతో వెంకటేశ్వరస్వామిని సేవించడానికి తన పరిపూర్ణమైన జీవితాన్ని అంకితం చేశారని శ్లాఘించారు. భక్తి సంగీతం ఉన్నంతకాలం బాలకృష్ణ ప్రసాద్ చిరస్మరణీయులుగా నిలుస్తారని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. తాటిచెట్లపాలెం, తాటిచెట్లపాలెం బజారు, రైల్వే క్వార్టర్స్, రైల్వే అక్వా స్పోర్ట్స్ ఏరియా, రెడ్డి తాటిచెట్లపాలెం, రైల్వేన్యూకాలనీ, 28 బస్టాప్ రోడ్డు, కారుణ్యాయి పెట్రోల్ బంకు ఏరియా, పరదేశమ్మ ఆలయం, సంతోషిమాత ఆలయం ఏరియాల్లో కరెంట్ ఉండదని చెప్పారు.

బెంగళూరు ప్రత్యేక రైలుకు ఎలమంచిలిలో హాల్ట్

విశాఖపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): హోలీ ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ-ఎస్ఎంవీ బెంగళూరు మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్ల సర్వీసులకు ఎలమంచిలిలో ఒక నిమిషంపాటు హాల్ట్ కల్పిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. దీంతో విశాఖ-బెంగళూరు (08549) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 16 నుంచి, తిరుగు ప్రయాణంలోని బెంగళూరు-విశాఖ (08550)కు ఈ నెల 17 నుంచి ఎలమంచిలి స్టేషన్‌లో హాల్ట్ అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.

28న న్యాయవాద సంఘం ఎన్నికలు

డాబాగార్డెన్స్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విశాఖ న్యాయవాద సంఘం వార్షిక ఎన్నికలు ఈ నెల 28న జరుగుతాయని ప్రముఖ న్యాయవాది జీఎం రెడ్డి తెలిపారు. సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 18 వరకు నామినేషన్ల స్వీకరణ, 19న పరిశీలన, 20న ఉపసంహరణకు గడువని తెలిపారు. వివిధ పదవులకు 28న ఉదయం 10.30 గంటలకు ఎన్నికలు నిర్వహించి అదే రోజు సాయంత్రం ఆరు గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమై రాత్రికి తుది జాబితా ప్రకటిస్తారన్నారు. న్యాయవాదులకు అసౌకర్యం కలగకుండా త్వరితగతిన ఎన్నికల ఫలితాలు విడుదల చేస్తామని తెలిపారు.

గెడ్డలో వ్యర్థాల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మురళీనగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వారు చూడరు... వీరు మారరు" శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన వార్తకు జీవీఎంసీ, పారిశుధ్య సిబ్బంది స్పందించారు. 51వ వార్డు పరిధిలోని గెడ్డల్లో వ్యర్థాలను తొలగించారు. లక్ష్మీగణపతి దేవాలయం పక్కనే ఉడాకాలనీ పద్మావతి పార్క్ ప్రవేశ ద్వారం వద్ద పడేసిన కొబ్బరి చెట్ల దుంగల్ని యంత్రాల సాయంతో తొలగించారు. పారిశుధ్య ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ హేమసుందర్ చొరవతో వ్యర్థాల్ని గెడ్డ నుంచి బయటకు తీయించారు. గ్యాస్ గోడౌను దారి పొడుగునా ఉడాకాలనీలో ఉన్న ప్రధాన గెడ్డ అంచున ఆక్రమణలు, చెత్త నిల్వను తొలగించేందుకు సత్వరమే చర్యలు తీసుకుంటామని తెలిపారు. గెడ్డ పక్కన ఉంటున్న నివాసితులు, కాలనీ వాసులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు.



ఆర్పీపేటలో పైడిమాంబ ఉత్సవ కోలాహలం





అమ్మవారి ప్రతిమను మోస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

నగరంలో ప్రతిమలతో భక్తుల ర్యాలీ

ఆర్పీపేట (కంచరపాలెం), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆర్పీపేట గ్రామ దేవత పైడితల్లమ్మ తొలేళ్ల ఉత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు అమ్మవారి ప్రతిమలను మోసుకుంటూ ఊరేగింపుగా బంగారమ్మ గుడికి చేరుకుని పూజలు చేశారు. అనంతరం తమ ఇళ్లకు ప్రతిమలను తీసుకుని వెళ్లారు. అమ్మవారి తొలేళ్ల సందర్భంగా గ్రామంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారి ప్రతిమలను భక్తులు గుడి వద్దకు తీసుకుని వచ్చి అప్పగిస్తారు. రైల్వే గేటు వద్ద గల అమ్మవారి పుట్టబంగారం గుడి, అమ్మవారి ప్రధాన ఆలయాన్ని విద్యుత్ కాంతులు, మామిడి తోరణాలతో అలంకరించారు. పైడిమాంబ అమ్మవారి ప్రధాన పండగను మంగళవారం ఘనంగా నిర్వహిస్తారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లను గ్రామ అభివృద్ధి కమిటీ పూర్తిచేసింది. అమ్మవారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీస్ బందోబస్తును నియమించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం కంచరపాలెం మెట్టు నుంచి ఆర్పీపేటలోని అమ్మవారి ప్రధానాలయం వరకు వివిధ స్టేజి ప్రోగ్రాంలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు.

ముత్యాలమ్మ ప్రతిమలు పెద్దింటికి తరలింపు



ముత్యాలమ్మ ప్రతిమలను ఊరేగిస్తున్న భక్తులు

సీతమ్మధార, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నక్కవానిపాలెం గ్రామ దేవత ఏడుగుళ్ల ముత్యాలమ్మవారి పండుగ మహోత్సవంలో భాగంగా దొండపర్తిలో తయారు చేసిన ముత్యాలమ్మ ప్రతిమలను భక్తులు తలపై పెట్టుకొని ఊరేగింపుగా సోమవారం తీసుకువచ్చారు. కాంప్లెక్స్ నుంచి ఏడుగుళ్ల వరకు అమ్మవార్ల ప్రతిమలను తీసుకువచ్చి పసుపు, కుంకుమలతో పూజలు చేసి అక్కడ నుంచి నక్కవానిపాలెం రామాలయం వద్ద పెద్దింటికి తీసుకువచ్చారు. పెద్దింటి వద్ద రాత్రి తొలేళ్ల ఉత్సవాన్ని జరిపారు. గ్రామ కమిటీ పెద్దలు కాటారాజు రెడ్డి, శ్యామల రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, రవికుమార్ రెడ్డి, గురుమూర్తి రెడ్డి, వేణు రెడ్డి, రమేష్, శ్రీనుబాబు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో కల్యాణ మహోత్సవం



దేవేరుల కల్యాణ ఘట్టంలో పాల్గొన్న భక్తులు

మహారాణిపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్‌లోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో నగరేశ్వర, జనార్దన స్వామిల పరిణయ మహోత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ నెల 15 వరకు ఆలయంలో నగరేశ్వర స్వామి-వింధ్యవాహిని, జనార్దన స్వామి-కోన కమలాదేవిల పరిణయ మహోత్సవాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కల్యాణ మహోత్సవ ఘట్టం విశేషాలను వివరించారు. పరమేశ్వరుడు ఆర్యవైశ్యులను రక్షించే వరం ఇచ్చారని అందువల్ల ఆలయంలో ఫాల్గుణ శుద్ధ ఏకాదశి రోజున వార్షిక కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజు విఘ్నేశ్వర పూజ పుణ్యాహవచనం, పంచగవ్యం, దీక్షాధారణ, త్రిశూల, వాస్తుపూజ, ధ్వజారోహణం, హోమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఆలయ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్ భక్తులకు ఏర్పాట్లు చేశారు.

క్రికెట్ సీనియర్ అంపైర్లకు సన్మానం



జోగారావు, రమేష్, రవికాంత్‌లను సన్మానిస్తున్న జేకేఎం.రాజు

విశాఖపట్నం స్పోర్ట్సు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ క్రీడా రంగానికి విశేష సేవలందిస్తున్న సీనియర్ అంపైర్లకు సోమవారం వీడీసీఏ-బి గ్రౌండ్‌లో ఘన సత్కారం జరిగింది. దాదాపు మూడు దశాబ్దాలుగా జిల్లా, రాష్ట్ర స్థాయి మ్యాచ్‌లకు అంపైర్‌గా వ్యవహరించిన జోగారావు, అంతర్జాతీయ మ్యాచ్‌లకు అంపైర్లుగా వ్యవహరించిన బీసీసీఐ ప్యానల్‌లోని రమేష్, రవికాంత్‌రెడ్డిలను జిల్లా క్రికెట్ సంఘం ఉపాధ్యక్షుడు, ఏసీఏ వీడీసీఏ స్టేడియం అడ్మినిస్ట్రేటివ్ ఇన్‌చార్జి జె.కె.ఎం.రాజు ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీసీఐ ప్యానల్ స్కోరర్లు, అనలిస్టులు, వర్ధమాన అంపైర్లు తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కల బెడదపై మేయర్‌కు కార్పొరేటర్ వినతి



మేయర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ గంకల కవిత

కంచరపాలెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 48వ వార్డులో స్వైర విహారం చేస్తున్న వీధి కుక్కల నియంత్రకు చర్యలు తీసుకోవాలని నగర మేయర్ హరి వెంకట కుమారిని ఆ వార్డు కార్పొరేటర్ గంకల కవిత అభ్యర్థించారు. సోమవారం మేయర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. వార్డులో ఆరు సచివాలయాల పరిధిలో వీధికుక్కల బెడదతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించేలా సిబ్బందికి సూచించాలని కోరారు.

పోర్టు ఆసుపత్రి రీ టెండర్ కాపీల దహనం



టెండర్ కాపీలు దహనం చేస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పోర్టు ఆసుపత్రిని రీ టెండరింగ్ చేయాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ పోర్టు యూనియన్ గౌరవాధ్యక్షుడు వీఎస్ పద్మనాభరాజు డిమాండ్ చేశారు. పోర్టు ఆసుపత్రి ఎదుట సోమవారం టెండర్స్ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా కోట్లాది రూపాయల లాభాలు సంపాదిస్తున్న పోర్టు ఉద్యోగులకు ఆరోగ్య అంశాన్ని వ్యాపారం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గతేడాది సెప్టెంబరు 24న ఇచ్చిన టెండర్లు తాము చేసిన పోరాటం వల్ల రద్దయ్యాయని గుర్తు చేశారు. మళ్లీ టెండర్లు పిలవడం దుర్మార్గమన్నారు. ఈ ఏడాది పోర్టుకు సుమారు రూ.800 కోట్ల లాభం వచ్చిందని, దానిలో నాలుగో వంతు ఖర్చు చేసినా ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బందిని నియమించవచ్చని చెప్పారు. పోర్టు యాజమాన్యం వద్ద రిజర్వ్ ఫండ్స్, 7 వేల ఎకరాల భూమి ఉందని, సొంత నిధులతోనే అభివృద్ధి చేసే శక్తి సామర్థ్యాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్బీ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రామారావు, సీఐటీయూ నాయకులు కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, బి.జగన్, రామలింగేశ్వరరావు, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారి ఉత్సవాలకు అంకురార్పణ



ఉడుపురాట ఉత్సవంలో పాల్గొన్న గ్రామ పెద్దలు


కంచరపాలెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 48వ వార్డు పరిధి జైభారత్ నగర్ (బర్మాక్యాంప్)లో కొలువై ఉన్న నూకాంబిక అమ్మవారి ఉత్సవాలకు సోమవారం అంకురార్పణ జరిగింది. బర్మాక్యాంప్ వద్ద గల అమ్మవారి ఆలయంలో ఈ నెల 20 నుంచి 28 వరకు ఉత్సవాలు జరగనున్నాయి. సోమవారం అమ్మవారి ఉడుపురాట మహోత్సవంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈవో రాజగోపాల్, టీడీపీ, బీజేపీ నాయకులు గొర్లె అప్పారావు, జగదీష్, అర్చకుడు గణేష్ పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడికి పాల్పడిన ఇద్దరు మైనర్ల అరెస్టు

మహారాణిపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి జగదాంబ సెంటరులో ఆదివారం రాత్రి ఓ వ్యక్తిపై బీరు సీసాతో దాడి చేసి గాయపరచిన ఇద్దరు మైనర్లను అరెస్టు చేసినట్లు మహారాణిపేట పోలీసులు తెలిపారు. కొందరు మద్యం తాగి గొడవ పడుతుండగా అటుగా వస్తున్న చింతల సాయి మనోహర్ అనే వ్యక్తిని గాయపరచడమేగాక బెదిరించారు. స్థానికులు అతనిని వెంటనే కేజీహెచ్‌కు తరలించి చికిత్స చేయించారు. మహారాణిపేట పోలీసులకు సమాచారం అందటంతో ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ మంటల్లో కాలి వృద్ధుడు మృతి

సీతంపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో రైల్వే కొత్త కాలనీ, కన్నారావు వీధిలోని ఓ ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో మంటలు వ్యాపించి సరగడ వెంకటరావు (80) అనే వృద్ధుడికి అంటుకుని కాలిపోయి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... మండల అదిలక్ష్మి తండ్రి అయిన సరగడ వెంకటరావు కుమార్తెతో కలిసి ఆమె ఇంట్లో ఉంటున్నాడు. వెంకటరావు ఆరేళ్లుగా పక్షవాతంతో బాధపడుతూ మంచంపట్టాడు. ఆదివారం రాత్రి వారు నివసిస్తున్న ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు వ్యాప్తి చెందాయి. దీంతో వెంకటరావు ఉంటున్న గదిలో పెద్దఎత్తున పొగలు వచ్చి మంటలు చేలరేగాయి. వెంకటరావు కేకలు వేయడంతో గది లోపల ఉన్న అతన్ని బయటకు తేవడానికి స్థానికుల సహాయంతో ప్రయత్నించారు. ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక శకటం వచ్చి మంటలు ఆర్పింది. అయితే గదిలో మంచం మీద ఉన్న వెంకటరావు శరీరం అప్పటికే సగభాగం కాలిపోవడంతో మృతి చెందాడు. అతడి కుమార్తె ఆదిలక్ష్మి నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకటరావు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



మృతుడు సరగడ వెంకటరావు (ఫైల్)

ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలు

మహారాణిపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న పిఠాపురంలో జరిగే పార్టీ ఆవిర్భావ సభకు భారీగా జనం తరలి రావాలని జనసేన జిల్లా అధ్యక్షుడు, దక్షిణ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. సోమవారం జగదాంబ సెంటర్‌లోని క్లాక్ టవర్ వద్ద పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వీర మహిళలతో కలసి కేకు కోశారు. అనంతరం ఆవిర్భావ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శివప్రసాద్ రెడ్డి, కార్పొరేటర్లు వసంతలక్ష్మి, కె.నాగరాజు, డైరెక్టర్ రూప, నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.



వీర మహిళలతో కలిసి కేకు కోస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

భోజనం శుచి, రుచి ఉండాలి: కలెక్టర్



భోజనం రుచిపై ఆరా తీస్తున్న కలెక్టర్

మహారాణిపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సోమవారం సాయంత్రం కేజీహెచ్ సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జీవీఎంసీ జోన్ కమిషనర్ మల్లయ్యనాయుడుతో కలిసి క్యాంటీన్ అంతా కలియతిరిగి పరిశుభ్రత తీరును పరిశీలించారు. అక్కడ భోజనం చేస్తున్నవారితో మాట్లాడి ఆహారం రుచి, నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. పేదల ఆకలిని తీర్చే క్యాంటీన్ ఆవరణ, భోజనం చేసే పళ్లేలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. వచ్చిన వారికి అతిథి దేవోభవ అంటూ చిరునవ్వుతో ఆహారాన్ని అందించాలని సూచించారు. క్యాంటీన్ నిర్వహణలో లోపాలు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏపీడీ పద్మావతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ఎన్టీఆర్ విశేష కృషి

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ



పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ నేతలు

విశాఖపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళా సాధికారతకు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు కృషిచేశారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం సావిత్రీబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ మహిళల స్వయం ఉపాధికి సీఎం చంద్రబాబు డ్వాక్రా సంఘాలు ఏర్పాటుచేశారన్నారు. చేనేత రంగంలో మహిళలకు రూ.60 లక్షలు, 1.5 లక్షల మందికి ఉచితంగా కుట్టుమిషన్లు, ఉపాధి కల్పనకు మహిళలకు ఉచితంగా ద్విచక్రవాహనాలు అందించారన్నారు. ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఉత్పత్తులు అమ్ముకునేలా అవకాశం కల్పించారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు గ్రాట్యుటీ అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పీలా శ్రీనివాస్, పొలమరశెట్టి శ్రీనివాసరావు, వెల్లంకి భరత్, తమ్మిన విజయకుమార్, అనసూరి మధు, కేదారి లక్ష్మి, అంగటి రాము, తాజుద్దీన్ పాల్గొన్నారు.

ఏప్రిల్ 1 నుంచే ఇంటర్ తరగతులు

... 5వ పేజీ తరువాయి

వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఈ క్లాసులు మొదలుపెట్టనున్నారు. ఏప్రిల్ 7 నుంచి ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించనున్నారు. పదో తరగతి పరీక్ష రాసిన ప్రతి విద్యార్థి ఇంటర్ మొదట సంవత్సరంలో అడ్మిషన్ తీసుకోవచ్చు. ఏప్రిల్ 23 వరకు క్లాసులు, ప్రవేశాలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 24 నుంచి జూన్ 1 వరకు సెలవులు ప్రకటించారు. మళ్లీ జూన్ 2 నుంచి యథావిధిగా క్లాసులు ప్రారంభమవుతాయి. దీనివల్ల ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు మెరుగుపడే అవకాశం ఉందంటున్నారు. ఏప్రిల్ 1 నుంచి 23 వరకు నిర్వహించే తరగతుల్లో 15 శాతం సిలబస్ పూర్తిచేస్తారు. మొత్తం సిలబస్‌ను కూడా డిసెంబరు 31 తేదీకంటే ముందే పూర్తి చేసి రివిజన్ ప్రారంభిస్తారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న సైన్స్ గ్రూపు విద్యార్థులకు జేఈఈ, ఎంసెట్‌లకు శిక్షణ ఇవ్వాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది.

ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అకడమిక్ తరగతులు నిర్వహించి, 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జేఈఈ, ఎంసెట్ శిక్షణ కల్పించనున్నారు. విశాఖ ఉమ్మడి జిల్లాలో 68 సాంఘిక, గిరిజన సంక్షేమ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో ఏటా దాదాపు 13 వేల మంది విద్యార్థులు చేరుతుంటారు. వచ్చే నెల నుంచే ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ మొదలుపెట్టడం వల్ల విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని అధ్యాపకులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ ప్రవేశాల్లో టెన్త్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కొనసాగించి ఫెయిలైన వారికి తొలగిస్తారు.

వైసీపీ నేత బరితెగింపు

... 5వ పేజీ తరువాయి

ఆక్రమణలు ఉంటే తొలగించాలని పెదగంట్యాడ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఇటీవల పెదగంట్యాడ రెవెన్యూ అధికారులు అక్కడకు వెళ్లి ప్రభుత్వ భూమిని ఆక్రమించి కల్యాణ మండపం నిర్మిస్తున్నట్టు నిర్ధారించి తొలగింపునకు శ్రీకారం చుట్టారు. ఆక్రమణల తొలగింపు నిలుపు చేయాలని వైసీపీ నేత కుమారుడు రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. అదే సమయంలో కూటమికి చెందిన ఒక ప్రజాప్రతినిధి నుంచి కూడా రెవెన్యూ అధికారులకు ఒత్తిడి రావడంతో అక్కడ నుంచి వెనుతిరిగినట్టు ఆ శాఖ అధికారులే చెబుతున్నారు. ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన ప్రజా ప్రతినిధులు, అధికారులు అందుకు విరుద్ధంగా ఆక్రమణదారులకు అండగా నిలవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పోలీస్ శాఖలో పదోన్నతులు, బదిలీలు

... 5వ పేజీ తరువాయి

హెడ్‌కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న నలుగురికి ఏఎస్ఐలుగా పదోన్నతి కల్పించారు.

34 మందికి బదిలీ

నగర పోలీస్ కమిషనరేట్‌లో కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్, ఏఎస్ఐలుగా పనిచేస్తున్న 34 మందిని ఇతర స్టేషన్లకు బదిలీ చేస్తూ సోమవారం సీపీ ఉత్తర్వులు జారీచేశారు. వీరిలో ముగ్గురు ఏఎస్ఐలు, 20 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 11 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు.

చేజారిన ప్రభుత్వ స్థలం

... 5వ పేజీ తరువాయి

సంగీత్‌మాధుర్ వద్ద ప్రస్తావించగా కోర్టు డిక్రీపై అప్పీలు చేస్తామన్నారు. కె.నగరపాలెం, కాపులుప్పాడ, మంగమారిపేటలో సర్వే నంబరు 296/4 సీ, 298/6 నుంచి 9లో 1.57 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని స్పష్టంచేశారు. కోర్టు నుంచి వచ్చిన సమన్లు అధికారులకు అందకపోవడంపై విచారణ చేపడతామన్నారు.

లాడ్జిల్లో ఆకస్మిక తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

కలిగి ఉన్నారా?, లేదా?, మైనర్లు ఎవరైనా గదుల్లో బస చేశారా?, హోటల్‌కు అన్నిరకాల అనుమతులు ఉన్నాయా?...అనే అంశాలపై ప్రధానంగా దృష్టిసారించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ అనుమతులు లేని హోటళ్లు/లాడ్జిలు 42, ట్రేడ్ లైసెన్స్‌లు లేనివి 12, ఫుడ్‌లైసెన్స్ లేనివి 12, జీఎస్టీ సర్టిఫికెట్ లేనివి 17, సందర్శకుల రికార్డులు నిర్వహించనవి రెండు, వీఎంఎస్ అప్‌డేట్ చేయనవి 14, సీసీ టీవీలు లేనివి రెండు ఉన్నట్టు గుర్తించారు. వీటిపై చట్టపరంగా కేసులు నమోదుచేసి చర్యలు తీసుకుంటామని సీపీ శంఖబ్రతబాగ్చి ఒక ప్రకటనలో తెలిపారు.

హయగ్రీవకు ఝలక్

... 5వ పేజీ తరువాయి

చెల్లుబాటు కావడంతో ఎంవీవీ సత్యనారాయణ తెర వెనుక అంతా నడిపించారు. అనుమతులు లేకుండానే పనులు చేపట్టారు. ప్లాట్లు అమ్మేశారు. అధికారులు అనుమతులు ఇవ్వకపోతే కోర్టుకు వెళ్లి నిబంధనల ప్రకారం చేస్తామని చెప్పి ఉత్తర్వులు తెచ్చుకున్నారు. కలెక్టర్ మూడేళ్లలో నిర్మాణం పూర్తిచేయాలని చెబితే ఐదేళ్లయినా చేయలేకపోయారు. హయగ్రీవ ప్రాజెక్టుపై గత ఐదేళ్లూ అధికారులకు, ఎంవీవీకి, ఆడిటర్ జీవీలకు మధ్య పెద్ద యుద్ధమే జరిగింది. విచిత్రం ఏమిటంటే...వృద్ధులకు పది శాతం భూమిలోనే ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆ పది శాతం పూర్తి చేయడానికి వారికి ఐదేళ్లూ సరిపోలేదు. మిగిలిన భూమిని వాణిజ్యపరంగా లాభదాయకంగా మార్చుకోవడంపైనే వారు దృష్టిపెట్టారు. మంచి లొకేషన్‌లో ఉండడంతో నగరంలోని ధనవంతులు, రాజకీయ నాయకులు కోట్ల రూపాయలు పెట్టి వాటిని కొనుగోలుచేశారు. ఈ నేపథ్యంలో జగదీశ్వరుడు రెండేళ్ల క్రితం 'సెల్ఫీ వీడియో' విడుదల చేశారు. తనకు ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ఆయనపై వైసీపీ హయాంలో అనేక కేసులు పెట్టించారు.

ఎవరికి వారు పోరాటం

ప్రభుత్వ భూమిలో వ్యాపారం సహించలేని విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. అనేక సార్లు అసెంబ్లీలో ప్రస్తావించారు. భూమిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశారు. అంతకు ముందు ప్రజా పద్దుల సంఘం కూడా ఈ భూమిని తక్కువ ధరకు ఇచ్చారని ఆక్షేపించింది. అనేక ఉల్లంఘనలు, తప్పులు జరగడంతో ప్రభుత్వం ఆ భూమిని వెనక్కి తీసుకోవాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

ఇవి గుర్తుంచుకోవాలి.

నగరంలో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రజాసేవ ముసుగు వేసుకొని తప్పుడు పనులు చేస్తున్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించి, కబ్జా చేసి ప్రాజెక్టులు చేపడుతున్నారు. వాటిలో ఏది కొన్నా ప్రజలు నిండా మునిగిపోవలసిందే. ఇప్పుడు ప్రభుత్వం నిబంధనలను కఠినంగా అమలు చేస్తోంది. ఎన్ని దశాబ్దాల తరువాతైనా ప్రభుత్వ భూమిని వెనక్కి తీసుకునే అవకాశం ఉంది. కాబట్టి ఇలాంటి తప్పుడు పనులతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే వారి దగ్గర ఏది కొన్నా భవిష్యత్తులో చిక్కులు తప్పవు. కాబట్టి తస్మాత్ జాగ్రత్త. కొంటే మునిగిపోవడమే. కాపాడేవారే ఉండరు.

పీజీఆర్ఎస్‌కు 24 వినతులు

గాజువాక, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 24 వినతులు వచ్చాయి. వీధి లైట్లు వేయాలని, పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని, రోడ్లపై ఉన్న గోతులను పూడ్చాలని, పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, తదితర సమస్యలపై వినతులు స్వీకరించారు. ఆయా సమస్యలను త్వరితంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు జడ్సీ శేషాద్రి ఆదేశించారు.

వేపగుంటలో 19 అర్జీలు

వేపగుంట: జీవీఎంసీ వేపగుంట జోనల్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 19 ఫిర్యాదులు అందాయి. వీటిలో ముఖ్యంగా 93వ వార్డు పరిధి బాలాజీనగర్, విరాట్‌నగర్‌లో ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని, విరాట్‌నగర్‌లో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని, 96వ వార్డు దగ్గువానిపాలెంలో రోడ్లు, డ్రైనేజీ సదుపాయాలు కల్పించాలని, పెందుర్తి ఏరియాలో కాలువలకు మరమ్మతులు చేయాలని, 97వ వార్డు సుజాతానగర్‌లో ఆట స్థలంలో నిర్వహణ చేపట్టాలని, చినముషిడివాడలో పార్కు స్థలాన్ని శుభ్రం చేయించాలని, తదితర ఫిర్యాదులు అందాయి. ఆయా ఫిర్యాదులను సంబంధిత శాఖాధిపతులకు పంపించి త్వరితంగా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జెడ్సీ కె.హైమావతి ఆదేశించారు.

విజ్ఞాన్‌లో ముగిసిన హ్యాక్‌థాన్ కోడింగ్ పోటీలు

అగనంపూడి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన హ్యాక్‌థాన్-2కే25 కోడింగ్ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ పోటీలకు జిల్లాలోని పలు ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 398 మంది విద్యార్థులు (79 జట్లు) పాల్గొన్నారు ఈ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన ఐదు జట్లు బహుమతులు గెలుచుకున్నాయి. విజేతలకు ప్రిన్సిపాల్ బి.అరుంధతి నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించేందుకు విద్యార్థులు కృషి చేయాలని సూచించారు.

'చలో పిఠాపురం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

అక్కిరెడ్డిపాలెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే ప్రతి జనసేన కార్యకర్త ఈ నెల 14న చేపట్టనున్న చలో పిఠాపురం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కోన తాతారావు కోరారు. 69వ వార్డులో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన చలో పిఠాపురం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరణం ముత్యాలనాయుడు, కంచిపాటి ప్రకాష్, గంధం వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **శబ్దం :** సంగం, శారద, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక),
- **మజాకా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
- **డ్రాగన్:** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
- **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ (గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 28, టమాటా 14, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 44, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 44, బీరకాయలు 50, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 18, క్యాబేజీ 12, క్యారెట్ 28 దొండకాయలు 40, బంగాళదుంపలు 15, అరటికాయ (పె)6, అల్లం (పాతది) 50, బరబాటి 36, ముల్లంగి 26, మునక్కాడలు (కిలో) 60, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 44, దోసకాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 90, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 46, కీరదోస 26, క్యాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 34 చిలగడదుంపలు 42, కంద64, దేముడుచిక్కుడు 58, గోరుచిక్కుడు 32, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు బ్రాయిలర్

రైతు ధర	78
లైవ్ ధర	98
విత్ స్కిన్	166
స్కిన్‌లెస్	176

తిరుమలనగర్ కాలనీ సమస్యలను పరిష్కరిస్తాం

- ఖాళీ స్థలం చుట్టూ ప్రహరీని నిర్మిస్తాం
- భూగర్భ జలాలు కలుషితం కాకుండా చూస్తాం
- 'పాలిమర్స్' వద్ద సెల్ టవర్‌ను తొలగిస్తాం
- వాయు, శబ్ద కాలుష్య నివారణకు చర్యలు చేపడతాం
- ఐలా కమిషనర్ కిశోర్



ఐలా కమిషనర్ కిశోర్‌కు సమస్యలను వివరిస్తున్న కార్పొరేటర్, తిరుమలనగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

కూర్మన్నపాలెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమలనగర్‌ను ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో వ్యర్థాలు వేయకుండా తగిన చర్యలు తీసుకుంటామని, ఆ స్థలం చుట్టూ ప్రహరీని నిర్మిస్తా



మని కాలనీవాసులకు ఐలా కమిషనర్ కిశోర్ హామీ ఇచ్చారు. ఇండస్ట్రియల్ రసాయన వ్యర్థాల వల్ల భూగర్భ జలాలు కలుషితం కాకుండా చర్యలు చేపడతామన్నారు. తిరుమల నగర్ వాసవి కల్యాణ మండపంలో ఇటీవల 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన 'అక్షరం అండగా- పరిష్కారమే అజెండాగా' ప్రత్యేక కార్యక్రమంలో స్థానికులు వివరించిన సమస్యలకు ఐలా కమిషనర్ స్పందించి సోమవారం గాజువాక పారిశ్రామికవాడ, తిరుమలనగర్ ప్రాంతాల్లో పర్యటించారు. అనధికార డంపింగ్ యార్డును పరిశీలించడంతో పాటు భూగర్భ జలాలు కలుషితమవుతున్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బొండా జగన్నాథం ఇక్కడి సమస్యలను వివరిస్తూ.. పారిశ్రామిక వాడకు సంబంధించిన డ్రైనేజీ వ్యవస్థ తిరుమలనగర్ రోడ్డు నంబర్-7 డ్రైనేజీకి కనెక్టై ఉందని, దీనివల్ల వివిధ రసాయనిక పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థ జలాలు డ్రైనేజీ ద్వారా తిరుమలనగర్ డ్రైనేజీలోకి వచ్చేస్తున్నాయని, దీనిని నియంత్రించాలని కోరారు.

అదేవిధంగా ఆటోనగర్ శివబాలాజీ పాలిమర్స్‌లో ఏర్పాటు చేసిన సెల్ టవర్‌ను తొలగించాలని, రోడ్డు నంబర్-9బీ వైపు పాలిమర్ ఇండస్ట్రీ గేట్లను మూసివేయాలని, ఆటోనగర్‌లోని స్టీల్ ఇండస్ట్రీస్, గ్రానైట్ ఇండస్ట్రీస్ నుంచి వచ్చే శబ్ద కాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అందుకు స్పందించిన ఐలా కమిషనర్ కిశోర్ సెల్ టవర్‌ను సత్వరమే తొలగిస్తామన్నారు. ఆటోనగర్ పరిశ్రమలకు చెందిన వ్యర్థ జలాలు తిరుమలనగర్ కాలనీ డ్రైనేజీల్లోకి రాకుండా చర్యలు చేపడతామని, ఇందుకు సంబంధించి ఇంజనీరింగ్ అధికారులతో ఒక ప్రణాళికను రూపొంది స్తామన్నారు. ఆటోనగర్ నుంచి శబ్ద, వాయు కాలుష్యం వెలువడకుండా చర్యలు తీసుకుంటామని, అవసరమైతే కాలుష్య నియంత్రణ మండలి అధికారుల సహాయం తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తిరుమలనగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమానందం, టీడీపీ వార్డు అధ్యక్షుడు రాజన్‌రాజు, స్థానిక నాయకులు పి.దానయ్య, ఆనంద కుమార్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

దూదేకులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

ఉమ్మడి విశాఖ జిల్లా నూర్బాషా దూదేకుల సంఘం ప్రతినిధులు

పెందుర్తి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మిగతా కులాలతో వారితో సమానంగా దూదేకుల వర్గీయులకు కూడా రాజకీయంగా తగిన ప్రాధాన్యం కల్పించాలని, తమను అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని ఉమ్మడి విశాఖ జిల్లా నూర్బాషా దూదేకులు సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. స్థానిక ద్రోణంరాజు నగర్‌లో గల ఉమ్మడి విశాఖ జిల్లా నూర్బాషా దూదేకుల సంఘ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు పాలకులు తమ



విలేకరుల సమావేశంలో సంఘం ప్రతినిధులు

వర్గీయులకు తప్పా మిగతా అన్ని వర్గాలకు అసెంబ్లీ, పార్లమెంటులకు అవకాశాలు కల్పించారన్నారు. కనీసం తమ వర్గానికి ఎమ్మెల్సీని కూడా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. భవిష్యత్తులోనైనా తమకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వక్ఫ్ బోర్డులో కూడా తమకు ప్రాధాన్యం కల్పించాలన్నారు. సమావేశంలో సంఘ అధ్యక్షుడు షేక్ బాబ్జీ, ఉత్తరాంధ్ర కన్వీనర్ ఇస్మాయిల్, సంఘ చైర్మన్ షేక్ ఖాన్ సాహెబ్, మండల కమిటీ అధ్యక్షుడు షేక్ సాహెల్, జిల్లా నాయకులు రెహమాన్. హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అన్యాయం జరిగితే సహించం

భెల్ హెచ్‌పీవీపీ విశ్రాంత కార్మిక సంఘ నాయకుల స్పష్టీకరణ

అక్కిరెడ్డిపాలెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): భెల్ హెచ్‌పీవీపీ కర్మాగార అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికులకు పదవీ విరమణ అనంతరం లభించే పెన్షన్ వంటి సదుపాయాల్లో అన్యాయం జరిగితే సహించేది లేదని భెల్ హెచ్‌పీవీపీ విశ్రాంత కార్మిక నాయకులు స్పష్టం చేశారు. భెల్ హెచ్‌పీవీపీ యూనియన్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో పీఎఫ్ సమస్యపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. కర్మాగారంలో ఆర్-సిరీస్ కార్మికుల జాయినింగ్ తేదీల నమోదులో ఏర్పడిన పొరపాట్లు వల్ల సుమారు 150 మంది కార్మికులకు పీఎఫ్, పెన్షన్‌లో తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతుందని వాపోయారు. అందువల్ల భెల్ యాజమాన్యం, గుర్తింపు కార్మిక సంఘాలు ఈ సమస్యపై చర్చించి పీఎఫ్ అధికారులు అడిగే రికార్డులను అందజేసి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు అలమండ వెంకటేశ్వరరావు, ఉరుకూటి బాబూరావు, ఎ.అప్పారావు, వి.అచ్చిలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నాట్స్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

సన్ ఫ్లవర్ స్కూల్‌కు రూ.20 లక్షల సాయం

నార్త్ అమెరికా తెలుగు సంఘం (నాట్స్) ప్రెసిడెంట్ మదన్ పాములపాటి



సన్ ఫ్లవర్ స్కూల్‌కు రూ.20 లక్షల చెక్కు అందిస్తున్న మదన్, తదితరులు

విశాఖపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో విభిన్నమైన సామాజిక సేవా కార్యక్రమాలను నార్త్ అమెరికా తెలుగు సంఘం (నాట్స్) నిర్వహిస్తోం దని నాట్స్ ప్రెసిడెంట్ మదన్ పాములపాటి పేర్కొన్నారు. సోమవారం పెదవాల్తేరులోని సన్ ఫ్లవర్ విభిన్న ప్రతిభావంతుల స్కూల్‌కు రూ.20 లక్షలు బస్ కొనుగోలుకు నాట్స్ అందించింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రెండేళ్లకు ఒకసారి అమెరికాలో నాట్స్ కన్వెన్షన్ పేరుతో తెలుగు సంబరాలు నిర్వహిస్తామని, తెలుగు భాష ఔన్నత్యాన్ని, సంస్కృతీ సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు తెలియజేసేలా విభిన్న కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ప్రధానంగా విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారిత, మంచి నీటి సౌకర్యాల కల్పనకు విశేష కృషి చేస్తోందన్నారు. నాట్స్ ఇండియా కో-ఆర్డినేటర్, గౌతు లచ్చన్న బలహీనవర్గాల సంస్థ (గ్లో) ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకన్న చౌదరి యార్లగడ్డ మాట్లాడుతూ నాట్స్ కన్వెన్షన్ నిర్వహించగా మిగిలిన రూ.2.5 కోట్లలో రూ.కోటిని రాష్ట్రంలోని వివిధ సంస్థలు నిర్వహించే సేవా కార్యక్రమాలకు అందించారన్నారు. ఇందులో భాగంగా సన్‌ఫ్లవర్ స్కూల్‌కు రూ.20 లక్షలు, హోప్ ఫర్ లైఫ్ సంస్థకు రూ.20 లక్షలు, వనవాసి కల్యాణి గిరిజన సంస్థకు రూ.26 లక్షలు, గ్లో సంస్థకు రూ.20 లక్షలు అందించారన్నారు. విభిన్న ప్రతిభావంతులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్న ఈ సంస్థకు సహకరించడం గొప్ప విషయమన్నారు. నాట్స్ చైర్మన్ ప్రశాంత్ పిన్నమనేని మాట్లాడుతూ మాతృభూమికి సేవ చేసే ఉద్దేశంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఎవల్యూట్జ్ సంస్థ వ్యవస్థాపకులు అరసాడ శ్రీనివాస్ మాట్లాడుతూ తనవంతుగా ఈ సంస్థకు రూ.10 లక్షలు అందించడం ఆనందంగా ఉందన్నారు. నాట్స్ ఎలక్ట్ ప్రెసిడెంట్ (కాబోయే) శ్రీహరి మందడి మాట్లాడుతూ సమాజానికి సేవ చేసే ఉద్దేశంతో నాట్స్ పనిచేస్తోందన్నారు. కార్య క్రమంలో కన్వెన్షన్ కన్వీనర్ శ్రీనివాస్ గుత్తికొండ, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ శ్రీనివాస్ పిడికిటి, గత ఈసీ సభ్యులు సురేష్ బొల్లు, సన్‌ఫ్లవర్ స్కూల్ వ్యవస్థాపకులు ఎం.నాగరాజకుమారి, సంస్థ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'తక్షణమే పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి'

పెందుర్తి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో పేదలకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మూడు, రెండు సెంట్ల ఇంటి స్థలం, నిర్మాణానికి నాలుగు లక్షలు ఇస్తామన్న ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తమ హామీని అమలు చేయకపోవడం దారుణమని సీపీఐ రాష్ట్ర నేత జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. సీపీఐ పెందుర్తి ఏరియా సమితి ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పేదలకు తక్షణమే ఇళ్ల స్థలాలివ్వాలంటూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలవుతున్నా ఇప్పటివరకు పేదల స్థలాలపై ఎటాంటి ప్రకటన చేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్నారు. అనంతరం తహశీల్దార్ ఆనంద్‌కుమార్‌కు పేదల ఇళ్లకు సంబంధించిన దరఖాస్తులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.శ్రీనివాస్, వై.రాంబాబు, అసిరినాయుడు, అన్నపూర్ణ, రాము, రమణ, పరశురామ్, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేత

మల్కాపురం: నిరుపేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరుతూ ములగాడ తహశీల్దార్ భుజంగరావుకు సోమవారం సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ముందుగా పారిశ్రామిక ప్రాంతంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకుడు గుడాల రాంబాబు మాట్లాడుతూ పట్టణ పేదలకు మూడు సెంట్లు, గ్రామీణ పేదలకు రెండు సెంట్ల స్థలం ఇస్తామని.. ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు స్తామని సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నూనెల సూరిబాబు, డి.గోపి, టి.కామేశ్వరరావు, బి.వెంకట్, గుడాల జయ, ఎస్.లక్ష్మి జి.రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ప్రాజెక్టు కార్యాలయం సమీపంలో ఈ నెల 4న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పెదగంట్యాడ సమీపం అయ్యన్నపాలేనికి చెందిన జి.పెంటయ్యరెడ్డి ఆ రోజు రాత్రి బయటకు వెళ్తానని తల్లికి చెప్పి స్కూటీపై బయలుదేరాడు. అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో ఓ వ్యక్తి పెంటయ్యరెడ్డి తమ్ముడు మణికంఠకు ఫోన్ చేసి పెంటయ్యరెడ్డి రోడ్డుపై పడిపోయాడని తెలిపాడు. దీంతో మణికంఠ తన స్నేహితులతో వెళ్లి చూడగా సోదరుడి చేతికి గాయం ఉండడంతో ఇంటికి తీసుకువెళ్లారు. మర్నాడు రోజు ఉదయం పెంటయ్యరెడ్డికి వాంతులు కావడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడ నుంచి కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ పెంటయ్యరెడ్డి సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

పెదగంట్యాడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాలకు చెందిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా న్యూ పోర్టు పోలీసులు స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుని నుంచి రెండు టన్నుల బియ్యం, రవాణాకు ఉపయోగించిన ట్రక్కును పోలీసులు స్వాధీనం చేసుకుని సోమవారం కేసునమోదు చేశారు. న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గొడ్డువానిపాలేనికి చెందిన నిందితుడు స్థానికుల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి వాటిని ట్రక్కులో ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తుంటాడు. ఆదివారం సాయంత్రం ట్రక్కులో రేషన్ బియ్యం లోడ్ చేస్తుండగా.. తమకు అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి నిందితుడిని పట్టుకోవడంతో పాటు సరకును స్వాధీనం చేసుకున్నారు. సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోగొట్టుకున్న ఆభరణం బాధితురాలికి అప్పగింత

గోపాలపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ మెడలోని ఆభరణాన్ని తస్కరించిన దొంగలను రెండు రోజుల్లో పట్టుకుని, సదరు భరణాన్ని రికవరీ చేసి బాధితురాలికి పోలీసులు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అప్పలనరసమ్మ అనే మహిళ ఈ నెల 8న మర్రిపాలెంలో ఆటో ఎక్కి గోపాలపట్నం వస్తుండగా.. ఆ సమయంలో ఆటోలో ఉన్న ఇద్దరు మహిళలు అప్పలనరసమ్మ మెడలోని రెండు తులాల బంగారు ఆభరణాన్ని ఎంతో చాకచక్యంగా తస్కరించారు. ఈ మేరకు అప్పలనరసమ్మ గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేయగా వెస్ట్ సబ్ డివిజన్ క్రైమ్ సీఐ ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్ఐ జి.తేజేశ్వరరావు కేసు దర్యాప్తు చేశారు. ఆకివీడుకి చెందిన గొర్లె మౌనిక, ఎస్.శాంతి అనే మహిళలు బంగారు ఆభరణాన్ని చోరీ చేసినట్టు పోలీసులు నిర్ధారించుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. అప్పలనరసమ్మ నుంచి దొంగిలించిన ఆభరణాన్ని స్వాధీనం చేసుకుని సోమవారం బాధితురాలికి అప్పగించారు. చోరీ జరిగిన 48 గంటల్లోనే నిందితులను పట్టుకోవడంతో పాటు సొత్తును రికవరీ చేసిన ఎస్ఐ తేజేశ్వరరావు బృందాన్ని సీఐ శ్రీనివాసరావు అభినందించారు.

విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

విశాఖపట్నం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని విశాఖ బార్ అసోసియేషన్ ప్రతినిధులు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌ను కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బెవర సత్యనారాయణ ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం విజయవాడలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. విశాఖపట్నంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని, కోర్టు ఆవరణలో పది నెలలుగా మూతపడి ఉన్న క్యాంటీన్ తెరిపించాలని, జిల్లా కోర్టు నూతన భవనానికి ఏసీ సదుపాయం కల్పించాలని కోరారు. ఈ డిమాండ్లకు హైకోర్టు ప్రధానన్యాయమూర్తి సానుకూలంగా స్పందినట్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి నరేష్‌కుమార్, ఉపాధ్యక్షులు ఇమంది శ్రీనివాసరావు, కోశాధికారి అశోక్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వైసీపీ యువత పోరు పోస్టర్ ఆవిష్కరణ

పెందుర్తి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న యువత పోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టరును సోమవారం రాంపురంలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్ హయంలో ఉన్నత విద్యను అందిస్తే, సీఎం చంద్రబాబు విద్యార్థులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించేంత వరకు తాము పోరాడతామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయడు, నాయకులు గండి రవికుమార్, ఎం.మహేశ్, మహాలక్ష్మినాయుడు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి హాల్ టికెట్, ప్లాంక్ అందజేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మంచి మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి

పదో విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పిన ఎమ్మెల్యే పి.గణబాబు

మల్కాపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో సాధించిన మార్కులు భవిష్యత్తులో ఎంతో ఉపయోగతాపడయని, అందువల్ల ప్రతి ఒక్కరూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలంటూ టెన్త్ విద్యార్థులకు ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ఆల్ ది బెస్ట్ చెప్పారు. మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రత్యేక కార్యక్రమాన్ని సోమవారం హెచ్ఎం అరుణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మల్కాపురం పాఠశాల ఎప్పుడూ పదో తరగతిలో మంచి ఫలితాలను సాధిస్తుందని, ఈ ఏడాది కూడా అదే స్థాయిలో విద్యార్థులు రాణించాలన్నారు. అనంతరం ఆయన విద్యార్థులకు హాల్ టికెట్లు, ప్లాంక్‌లను అందజేశారు. హెచ్ఎం అరుణకుమారి మాట్లాడుతూ ఈ ఏడాది 219 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని, వీరిలో 598 మార్కులు సాధించే వారు కూడా ఉన్నారన్నారు. మల్కాపురం సీఐ ఎస్.విద్యాసాగర్ ఏ విధంగా పరీక్ష రాస్తే మంచి మార్కులను సాధించవచ్చో విద్యార్థులకు మెలకువలు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయుడు కుమార్ మాస్టార్, టీడీపీ వార్డు అధ్యక్షుడు మజ్జి సోమేశ్, నాయకులు కాకి పోలిరెడ్డి, సర్వసిద్ధి శ్రీలక్ష్మి, కె.రాము, జయశంకర్, కె.ఆదినారాయణ, భూలోకరాజు, ఎం.చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

భూ బాధిత రైతులను అడ్డుకున్న పోలీసులు



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న ఆందోళనకారులు

పెందుర్తిరూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రైల్వే వంతెన ఏర్పాటు నిమిత్తం భూములు కోల్పోనున్న తమకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టడానికి బయలుదేరిన రైతులను పోలీసులు అడ్డగించిన సంఘటన సోమవారం 95వ వార్డు పరిధి పొర్లుపాలెంలో చోటుచేసుకుంది. గోపాలపట్నం నార్త్ సింహాచలం రైల్వే స్టేషన్ నుంచి కొత్తవలస వరకు అదనంగా మరో ట్రాక్ నిర్మాణ పనులను రైల్వే శాఖ చేపట్టింది. ఇందులో భాగంగా పొర్లుపాలెం నుంచి పెందుర్తి రైల్వే స్టేషన్ వరకు వంతెన నిర్మించనున్నారు. ఇందుకోసం రైతుల నుంచి కొంతమేర భూములను సేకరించడానికి రెవెన్యూ యంత్రాంగం సమాయత్తమైంది. పొర్లుపాలెం నుంచి చింతల అగ్రహారం వరకు గల భూములు దేవస్థానం పరిధితో ఉండడం వల్ల భూములు కోల్పోయిన రైతులకు ఎటువంటి పరిహారం చెల్లించకుండానే ఆ భూములను ఖాళీ చేసి వెళ్లిపోవాలంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. దీంతో ఆందోళనకు గురైన రైతులు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేసేందుకు మాజీ ఉప సర్పంచ్ గల్లా వెంకటరమణ, చింతలఅగ్రహారం మాజీ సర్పంచ్ పి.వెంకటరమణ, రైతుసంఘాల ప్రతినిధులు పి.లక్ష్మణరావు, కొణతాల సూర్యనారాయణల ఆధ్వర్యంలో పొర్లుపాలెం, చింతలఅగ్రహారం, చీమలాపల్లి, లక్ష్మీపురం గ్రామాలకు చెందిన సుమారు రెండు వందల మంది రైతులు పొర్లుపాలెం నుంచి బయలుదేరారు. ఈ సమాచారం తెలుసుకుని పెందుర్తి పోలీసులు పొర్లుపాలెం వచ్చి రైతులను అడ్డగించారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులకు వ్యతిరేకంగా రైతులు నినాదాలు సీఐ కేవీ సతీశ్ కుమార్ ఆందోళకారులతో మాట్లాడారు. ఆందోళనకారులంతా కలెక్టర్ కార్యాలయం వరకు వెళ్లవచ్చని, అయితే అధికారులతో మాట్లాడడానికి ఐదుగురికి మించి వెళ్లరాదని సూచించడంతో ఆందోళనకారులు శాంతించారు. అనంతరం వారు కలెక్టరేట్‌కు వెళ్లారు.

ఘనంగా త్రిశక్తి ఆలయ ప్రథమ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కూర్మన్నపాలెం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి లక్ష్మీపురంలో ఆదివారం శ్రీదుర్గాలమ్మ, శ్రీనూకాలమ్మ, శ్రీపోలిపిల్లమ్మ అమ్మవార్ల ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం అర్చకులు ఇరగవరపు వాసు, చక్రపాణి స్వాముల పర్యవేక్షణలో అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు, సకల దేవతా మంత్ర హోమాలు, సూర్య నమస్కారాలు, ప్రాయశ్చిత్త హోమాలు, అర్చనలు, సామూహిక కుంకుమ పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధనను చేపట్టారు. కార్పొరేటర్ బొండా జగన్, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ కార్పొరేటర్ గొర్లె వెంకునాయుడుతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు అవిరెడ్డి సూర్యనారాయణ, కె.రామరాజు, ఎస్.బాబూరావు, ఎ.పెంటారావు, బి.అప్పలరాజు, ఐ.సన్యాసిరాజు, బీవీఆర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

త్రిముఖ ద్వారాల నిర్మాణానికి శంకుస్థాపన

పెదగంట్యాడ: మండలంలోని 14 పంచాయతీల ప్రజల ఆరాధ్యదైవమైన నెల్లిముక్కు శ్రీపెంటమాంబ ఆలయానికి త్రిముఖ ద్వారాలు ఏర్పాటు చేసేందుకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఆలయ నిర్వాహక కమిటీ నాయకుడు గొందేశి మహేశ్వరరెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డిలు శంకుస్థాపన చేశారు. అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులకు దక్షిణ ద్వార దర్శనం కల్పించేందుకు వీలుగా త్రిముఖ ద్వారాలను ఏర్పాటు చేస్తున్నారు. ఉగాది నుంచి అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమవుతాయని, అప్పటినుంచి ఆలయానికి భక్తుల తాకిడి అధికంగా ఉంటుందని, ఈలోగా త్రిముఖ ద్వారాల పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు గొందేశి అప్పలరెడ్డి, సత్యారావు, యెల్లేటి శ్రీనివాసరావు, పి.కుంచారావు, అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ, తదితరులు పాల్గొన్నారు.

చింతాలమ్మ ఉత్సవాలు ప్రారంభం

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీ లేమర్తి గ్రామస్థుల ఆరాధ్య దైవం చింతాలమ్మ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల జరిగే ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఘటాలను పురవీధుల్లో మంగళవాయిద్యాలు, తప్పెటగుళ్లు, కోలాటాల నడుమ ఊరేగించి ఆలయానికి తీసుకువచ్చి పూజలు జరిపారు. రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. మంగళవారం అమ్మవారి అనుపోత్సవాన్ని నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

నేడు పైడిమాంబ జాతర



ఫార్మాసిటీ పునరావాస కాలనీ ఏదురివానిపాలెం ప్రజల ఇలవేల్పు పైడిమాంబ పండగను మంగళవారం వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం ఆరు గంటల నుంచి పూజాది కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామన్నారు. ఇందులో భాగంగా రాత్రి ఏడు గంటల నుంచి పలు సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

ఊబకాయం...

సమస్యలు అనేకం



- 2050 నాటికి దేశంలో 44 కోట్ల మంది...
- గడచిన నెల రోజుల్లో రెండుసార్లు ప్రధాని నరేంద్రమోదీ ఆందోళన
- వంట నూనెల వినియోగాన్ని తగ్గించాలని సూచన
- ఒబెసిటీతో మధుమేహం, అధిక రక్తపోటు, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి సమస్యలు
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న వైద్యులు
- ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, జీవన విధానంతో పరిష్కారం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

"దేశంలో ఊబకాయం సమస్య తీవ్రమవుతోంది. 2050 నాటికి 44 కోట్ల మంది భారతీయులు ఊబకాయులుగా మారతారని అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రతి ముగ్గురిలో ఒకరు ఊబకాయంతో అవస్థలు పడే ప్రమాదం ఉంది. ఇది నిజంగా ప్రమాదకరమైన, దిగ్భ్రాంతిని కలిగించే విషయం. ఒబెసిటీ అతిపెద్ద సవాల్‌గా మారుతోంది. ఊబకాయ సమస్యను అధిగమించేందుకు వంట నూనెల వినియోగాన్ని కనీసం పది శాతం తగ్గించుకోండి'...అంటూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. గడిచిన నెల రోజుల వ్యవధిలో ఊబకాయ సమస్య గురించి ఆయన రెండోసారి ప్రజలను అప్రమత్తం చేశారు. ఈ నేపథ్యంలో అసలు ఊబకాయం బారినపడేందుకు గల కారణాలు, ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై అందిస్తున్న కథనం..

ఊబకాయం అంటే శరీర బరువు పెరగడం మాత్రమే కాదు. శరీరాన్ని రోగాల మయం చేసే అతిపెద్ద సమస్యగా దీనిని చూడాలని వైద్యులు చెబుతున్నారు. ఒబెసిటీ అంటే శరీరంలో తీవ్రస్థాయిలో కొవ్వు పేరుకుపోవడమే. పరిధికి మించి కొవ్వు పెరిగితే మధుమేహం, అధిక రక్తపోటు, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి, ప్రాథమిక దశలోనే బరువు పెరుగుతుండడాన్ని గుర్తించి అప్రమత్తం కావడం ద్వారా ఊబకాయం బారినపడకుండా చూసుకోవచ్చునంటున్నారు.

ఇవీ కారణాలు..

గతంతో పోలిస్తే ఒబెసిటీ పెరగడానికి మారిన ఆహారపు అలవాట్లు, జీవన విధానమే కారణంగా వైద్యులు చెబుతున్నారు. గతంలో ఇంట్లో వండిన ఆహార పదార్థాలు తినేవాళ్లు. ఇప్పుడు బయట ఆహారాన్ని అధికంగా తింటున్నారు. కార్బోహైడ్రేట్స్ అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా పిజ్జాలు, బర్గర్లు, ఆయిల్‌లో చేసిన ఆహార పదార్థాలు, కూల్ డ్రింక్స్ వంటివి తీసుకోవడం వల్ల కొవ్వు శరీరంలో స్థాయికి మించి పేరుకుపోతోంది. దాంతోపాటు శారీరక శ్రమ తగ్గడం, రాత్రివేళల్లో ఆహార పదార్థాలు తినడం, అర్ధరాత్రి దాటిన తరువాత కూడా నిద్రపోకపోవడం, తీవ్రమైన ఒత్తిడి వంటివి ఒబెసిటీకి కారణాలుగా చెబుతున్నారు.



శరీరంలో పెరిగే కొవ్వు వల్ల..

శరీరంలోని వివిధ భాగాల్లో పేరుకుపోయే కొవ్వు వల్ల ఒబెసిటీ వస్తుంది. సాధారణంగా ఒబెసిటీని బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) ద్వారా నిర్ధారిస్తారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో బీఎంఐ 30 ఉంటే ఒబెసిటీగా చెబుతారు. కానీ, భారత్‌లోని ఆహారపు అలవాట్లు, ఇతర కారణాల వల్ల 20.9 బీఎంఐ ఉంటే అధిక బరువుగా, 25 బీఎంఐ ఉంటే ఒబెసిటీగా చెబుతారు. 25 నుంచి 30 వరకు మొదటి దశ, 30 నుంచి 35 వరకు రెండో దశ, 35 దాటితే సమస్యగా పరిగణిస్తారు. వీరికి వైద్య సేవలు అందించాల్సి ఉంటుంది.

కేజీహెచ్‌కు భారీగా రోగులు

కేజీహెచ్‌లోని ఎండోక్రైనాలజీ విభాగానికి వారానికి సుమారు వేయి మంది వరకు వస్తుంటారు. అందులో దాదాపు 350 మంది వరకూ అధిక బరువు, ఒబెసిటీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. చిన్నారుల్లో అయితే ఈ సమస్య మరింత అధికంగా ఉంటోంది. ప్రతివారం 60 మంది పిల్లలు వస్తే అందులో దాదాపు 25 నుంచి 30 వరకు ఒబెసిటీ సంబంధిత లక్షణాలతో బాధపడుతున్నట్టు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలల్లో చదివే చిన్నారుల్లో ఈ సమస్య మరింత అధికంగా ఉంటోందని చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల్లో వంద మందిలో 15 మందికి ఒబెసిటీ ఉంటే, ప్రైవేటు పాఠశాలల్లో చదివే చిన్నారుల్లో 50 శాతం మందిలో ఈ సమస్య ఉంటున్నట్టు చెబుతున్నారు. దీనికి ప్రధానమైన కారణం పాఠశాలల్లో ఆటలు ఆడించకపోవడం, వ్యాయామం చేయించకపోవడమే కారణంగా చెబుతున్నారు.

చెక్ చెప్పడం ఇలా..?

ఒబెసిటీ బారినపడకుండా, ఒకవేళ బరువు పెరుగుతున్నా తగ్గించుకునే మార్గాలు కూడా ఉన్నాయి. జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. బయట ఆహారానికి, పిజ్జాలు, బర్గర్లు, ఆయిల్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి. వీలైనంత వరకూ ఇంట్లో చేసుకునే ఆహారాన్ని తీసుకోవాలి. శరీరంలో పెరిగే కేలరీలను కరిగించేందుకు వ్యాయామం చేయాలి. పిండి పదార్థాలు, కొవ్వు పదార్థాలు, వేపుళ్లు వంటి వాటికి దూరంగా ఉండాలి. ప్రతిరోజూ కనీసం ఆరు నుంచి ఏడు గంటలు నిద్రపోవాలి. వీలైనంత వరకూ రాత్రి ఏడు గంటలలోపు డిన్నర్ పూర్తిచేయాలి. స్వీట్స్, కూల్ డ్రింక్స్ వంటి వాటికి దూరంగా ఉండాలి.

ఆరోగ్యకరమైన అలవాట్లతోనే ఒబెసిటీకి దూరం



ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లతో ఒబెసిటీకి దూరంగా ఉండవచ్చు. గడిచిన కొన్నాళ్లుగా ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగ్గా ఉండడంతో బయట ఆహారం అధికంగా తీసుకుంటున్నారు. ఇంట్లో వంటలు తక్కువగా చేస్తున్నారు. దీనివల్ల ఒబెసిటీ సమస్య పెరుగుతోంది. ముఖ్యంగా జంక్ ఫుడ్, ఆయిల్ ఫుడ్స్, సాఫ్ట్ డ్రింక్స్ వల్ల పిల్లల్లో ఈ సమస్య గణనీయంగా పెరుగుతోంది. మహిళల్లో దాదాపు ప్రతి ముగ్గురిలో ఒకరు అధిక బరువు, ఒబె సిటీతో బాధపడుతున్నారు. వీలైనంత వరకూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు చేసుకోవడం, శారీరక శ్రమ ద్వారా ఈ సమస్య నుంచి బయటపడవచ్చు. గతంతో పోలిస్తే ఆయిల్స్ వినియోగం కూడా అధికమైంది. ఇది కూడా ఒబెసిటీకి కారణమవుతోంది. అందువల్ల నూనె వినియోగం బాగా తగ్గించాలి. ఆయిల్‌లో బాగా ఫ్రై చేసిన పదార్థాలకు దూరంగా ఉండాలి.

- డాక్టర్ కేవీవీ సుబ్రహ్మణ్యం, ఎండోక్రైనాలజీ విభాగాధిపతి, కేజీహెచ్

జాతీయ రహదారిపై ట్రావెల్స్ బస్సు బోల్తా

- 13 మందికి తీవ్ర గాయాలు



బోల్తా పడిన ట్రావెల్స్ బస్సు

ఏలూరు క్రైం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఏలూరు సమీపంలో 16వ నంబరు జాతీయ రహదారిపై ప్రైవేటు బస్సు సోమవారం వేకువజామున బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో 13 మందికి తీవ్ర గాయాలయ్యాయి. విశాఖ నుంచి ఆదివారం రాత్రి యోలో ప్రైవేటు బస్సు (ఏఆర్ 11 సీ 0808) గుంటూరుకు బయలుదేరింది. ఏలూరు ఆశ్రం ఆస్పత్రి వద్ద సోమవారం తెల్లవారుజామున రోడ్డుపక్కన ఉన్న సిమెంటు దిమ్మెలను ఢీకొని బోల్తా కొట్టింది. ఈ ఘటనలో విశాఖపట్నానికి చెందిన మణప్పురం పరమేశ్, ఎం.కోటేశ్వరరావు, తిరుమలరావు, ఎస్.ఉషాకుమారి, పి.ఉషారాణి, సూరిశెట్టి సంతోష్, శ్రీమంతుల కిరణ్మయ్, ఎం.రమేశ్, ఎస్.మనోజ్ కుమార్, సురేంద్రకుమార్, బొర్రా అంజలి, కె.రోహిత్ (గుంటూరు), నరసింహరాజు (విజయవాడ) తీవ్రంగా గాయపడ్డారు. బస్సులో 42 మంది ప్రయాణికులున్నారు. హైవే పెట్రోలింగ్ పోలీసులు, ఎన్‌హెచ్‌ఐ పెట్రోలింగ్ సిబ్బంది సహాయ చర్యలు చేపట్టారు. ఏలూరు రూరల్ ఎస్ఐ సీహెచ్‌కే దుర్గాప్రసాద్, పెదవేగి సీఐ వెంకటేశ్వరరావు సహాయక చర్యలు చేపట్టారు. 108 వాహనాల్లో క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం పది మంది ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లిపోయారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో క్రేన్‌లను రప్పించి బస్సును తీయించారు.

నకిలీ డీలర్లపై అధికారుల విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గాజువాక సర్కిల్ పరిధిలోని శ్రీహరిపురంలో ఒకే వ్యక్తి నాలుగు రేషన్ డిపోలు నిర్వహించడంపై పౌరసరఫరాలు,రెవెన్యూశాఖలు సంయుక్తంగా విచారణ చేపట్టాయి. 'నకిలీ డీలర్లు' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై జాయింట్ కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశించారు. దీంతో ఇన్‌చార్జి డీఎస్వో కల్యాణి, గాజువాక ఏఎస్వో కృష్ణ, ములగాడ తహసీల్దారు భుజంగరావు శ్రీహరిపురంలో డిపోలను, రికార్డులను పరిశీలించారు. అక్రమంగా డిపోలు తీసుకున్నట్టు ఆధారాలు సేకరించారు. నకిలీ డీలరు వెనుక గాజువాకలో సహాయ పౌరసరఫరాల అధికారిగా పనిచేసి ప్రస్తుతం పదోన్నతిపై మరో జిల్లాలో పనిచేస్తున్న వ్యక్తి ప్రమేయం ఉందని డీలర్లు చర్చించుకుంటున్నారు. నకిలీ డీలరుకు అనుకూలంగా గతంలో పలు రికార్డులు మార్చేశారని, గాజువాక ఏఎస్వో కార్యాలయంలో నకిలీ డీలరు చెప్పినట్టే నడిచేదంటున్నారు.

భూ ఆక్రమణదారులపై ఉక్కుపాదం

- వెలగపూడి రామకృష్ణబాబు, తూర్పు ఎమ్మెల్యే



విశాఖపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): భూ ఆక్రమణదారులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని, ఎండాడలో హయగ్రీవకు కేటాయించిన భూమిని వెనక్కి తీసుకోవడమే నిదర్శనమని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. 'హయగ్రీవ'కు ఇచ్చిన 12.51 ఎకరాలను వెనక్కి తీసుకుంటూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేయడంపై హర్షం వ్యక్తంచేశారు. ఈ వ్యవహారంపై తాను అసెంబ్లీలో పోరాడానని గుర్తుచేశారు. హయగ్రీవ ప్రాజెక్టులో మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఆడిటర్ గన్నమని వెంకటేశ్వరరావు పాత్రపై దృష్టిసారించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. వైసీపీ హయాంలో విశాఖలో జరిగిన భూదందాలన్నింటిపైనా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని వెలగపూడి కోరారు. నగరంలో ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న వారికి ప్రభుత్వ నిర్ణయం హెచ్చరికగా పేర్కొన్నారు.

దీపం లబ్ధిదారులకు సబ్సిడీ అందుతోందా?

- వైద్య పరీక్షలు, మందులకు రోగులను బయటకు పంపొద్దు
- అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిందే
- కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్
- పీఆర్‌జీఎస్‌లో 332 అర్జీల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, అధికారులు

మహారాణిపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దీపం పథకం లబ్ధిదారుల ఖాతాకు ప్రభుత్వ సబ్సిడీ జమ అవుతున్నదీ, లేనిదీ గమనించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కేజీహెచ్‌లోనే రోగులకు అవసరమైన అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలని, వారిని వైద్య పరీక్షలు, మందుల కోసం బయటకు పంపరాదని విస్పష్టంగా పేర్కొన్నారు. జిల్లాలో ఇసుక లభ్యత, వినియోగంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పి-4 సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి కారణంగా నిలిపివేసిన ప్రజా సమస్యల పరి ష్కార వేదికను సోమవారం పునరుద్ధరించడంతో ప్రజల నుంచి 332 వినతులు అందాయి. అర్జీల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వివిధ అంశాలపై పైవిధంగా ఆదేశాలిచ్చారు. అర్జీలను 24 గంటల్లోగా పరిశీలించి దరఖాస్తుదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని, ఒకే సమస్యపై మళ్లీ మళ్లీ అర్జీ వచ్చే పరిస్థితి తీసుకురావడం తగదని కలెక్టర్ పునరుద్ఘాటించారు. సమస్య పరిష్కరించకపోతే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. తాజాగా అందిన వినతులలో రెవెన్యూ 131, జీవీఎంసీ 111, పోలీసు 24, ఇతర విభాగాల నుంచి 66 అర్జీలు స్వీకరించారు. వివిధ శాఖలలో పెండింగ్ లో ఉన్న అర్జీలపై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్‌వో భవానీశంకర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఇన్విజిలేటర్ మృతి



మాధవరావు (ఫైల్)

భీమునిపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలకు ఇన్విజిలేటర్‌గా విధులకు హాజరైన ఉపాధ్యాయుడు డబ్బీరు మాధవరావు (55) గుండెపోటుతో మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి. తన బైక్‌పై మాధవరావు సోమవారం ఉదయం 7.45 గంటలకు కళాశాలకు వచ్చారు. వరండాలో ఆఫీస్ గది వద్ద గల బెంచీపై కూర్చున్నారు. ఆ సమయం లో ఆఫీసులో గుమస్తాలు చక్రవర్తి, సుజాత, ఇతర సిబ్బంది పరీక్షల నిర్వహణకు అవసరమైన పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఈలోగా వరండా పెద్ద శబ్దం వినిపించడంతో పరుగున వెళ్లిచూడగా...మాధవరావు కూర్చున్న బెంచీకి, గోడకు మధ్యలో పడిపోయి ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. కొద్దిసెకన్లకే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన ఆయనకు సిబ్బంది సీపీఆర్ చేయగా, కళ్లు తెరిచారు. ఆయన తనయుడు సుధీర్‌కు సమాచారం అందించడంతో ఆటోలో కాలేజీకి చేరుకున్నారు. వెంటనే సమీపంలోని చిన్నబజారు జంక్షన్‌లో ఉన్న ఒక ప్రైవేటు డాక్టర్ వద్దకు తీసుకువెళ్లగా...ప్రభుత్వాస్పత్రికి తరలించాలని సూచించారు. అక్కడి నుంచి సంగివలస ఎన్నారై ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు చికిత్స చేస్తుండగానే తుదిశ్వాస విడిచారు. తీవ్రమైన గుండెపోటు రావడంతో మృతిచెందారని వైద్యులు తెలిపారు. మాధవరావు ఇటీవల భీమిలి మినీ స్టేడియం వెనుక ఉన్న అపార్టుమెంట్‌లో ఫ్లాట్‌ను కొనుగోలు చేశారు. అక్కడే ఉంటూ రేఖవానిపాలెం ఎంపీపీ పాఠశాలలో ఎస్‌జీటీ విధులు నిర్వర్తిస్తున్నారు. ఇన్విజిలేటర్ మృతిచెందినట్టు సమాచారం అందడంతో ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ఐవో మురళీధర్, డీవీఈవో రాధ భీమిలి చేరుకున్నారు. కళాశాల అధ్యాపకులు, మండల విద్యాశాఖాధికారులు ఎం.శివరాణి, ఎ.జయప్రధ మృతుని నివాసానికి వెళ్లి సంతాపం తెలిపి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మాధవరావుకు భార్య అంజలి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

- ఆరు ద్విచక్రవాహనాలు స్వాధీనం

సీతంపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు స్టేషన్ల పరిధిలో ద్విచక్రవాహనాలు దొంగిలించాడన్న ఆరోపణపై ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఏడీసీపీ కె.మోహన్‌రావు, సీఐ చక్రధర్‌రావు సోమవారం విలేకర్లకు తెలిపారు. మద్దిలపాలెం అశోక్ నగర్‌కి చెందిన బట్టుల సాయిరామ్ (22) సీతమ్మధార టీపీటీ కాలనీలో ఓ ద్విచక్రవాహనాన్ని దొంగిలించడంతో బాధితుడు ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదుచేసిన క్రైమ్ ఎస్ఐ రాజు తన సిబ్బందితో దర్యాప్తు చేపట్టగా బట్టుల సాయిరామ్‌ను నిందితుడిగా గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో అతడు మూడు, నాలుగో పట్టణ పోలీసు స్టేషన్లు, ఎంవీపీ పోలీసు స్టేషన్ పరిధిలోనూ వాహనాలు దొంగిలించినట్లు అంగీకరించాడు. ఈ సందర్భంగా నిందితుడు సాయిరామ్ వద్ద ఆరు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామన్నారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



తహసీల్దార్‌కు దరఖాస్తులు అందిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, నేతలు

ఆరిలోవ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలుచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. పేదకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాలలో మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలని సీపీఐ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. తహసీల్దార్ పాల్‌కిరణ్‌కు దరఖాస్తులు అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా హామీల అమలుకు చర్యలు తీసుకోలేదన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన రూ.3.2 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌లో పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీకి నిధులు కేటాయించలేదన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి, మౌలిక వసతులు కల్పించి, లబ్ధిదారులకు అందజేయాలన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలని కోరుతూ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో తహసీల్దార్లు, కలెక్టర్లకు దరఖాస్తులు అందజేశామన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ పేదలకు ఇవ్వడానికి ప్రభుత్వ భూములు లేవంటున్నారని, వేలఎకరాలు కబ్జాదారుల గుప్పిట్లో ఉన్నాయని, వాటిని స్వాధీనం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు ఎ.విమల, ఎస్‌కే రెహమాన్, జీఎస్‌కే అచ్యుతరావు, ఏరియా కార్యదర్శులు వి.సత్యన్నారాయణ,కాచుబాబు, కె.లక్ష్మణరావు, ఏంఏ బేగం, బి.పుష్పలత, ఎ.రవి, బి.చిరంజీవి, ఎస్.త్రినాథ్, జేడీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ పోర్టుకు డ్రెడ్జింగ్ రాయితీ, క్రూయిజ్ టెర్మినల్ ఈ-వీసా ఇవ్వండి

- పార్లమెంటులో ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు అభివృద్ధి చెందాలంటే డ్రెడ్జింగ్ రాయితీ ఇవ్వాలని ఎంపీ శ్రీభరత్ కోరారు. పార్లమెంటులో సోమవారం పలు అంశాలపై మాట్లాడారు. ప్రధాన పోర్టుల్లో సరకు రవాణా సామర్థ్యం రెట్టింపు చేయాల్సి ఉందన్నారు. రవాణా వ్యయం తగ్గితే వ్యాపారంలో పోటీతత్వం మెరుగుపడుతుందన్నారు. దేశంలో భారీ మదర్ షిప్‌ల నిర్మాణానికి వీలుగా షిప్ బిల్డింగ్ క్లస్టర్లు ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు. భారీ నౌకలకు 18 మీటర్ల డ్రాఫ్ట్ అవసరమని, కానీ దేశంలోని అనేక పోర్టుల్లో 14- 16 మీటర్ల డ్రాఫ్ట్ మాత్రమే ఉందన్నారు. విశాఖపట్నం పోర్టు డ్రెడ్జింగ్‌కు అవసరమైన రాయితీ అందిస్తే భారీ నౌకలు వస్తాయన్నారు. పోర్టులో రూ.100 కోట్లతో క్రూయిజ్ టెర్మినల్ నిర్మించారని, ప్రధాన పోర్టులో ఉన్న ఈ-వీసా సదుపాయం విశాఖ పోర్టుకు తక్షణమే ఇవ్వాలన్నారు.

వైభవంగా అనంత పద్మనాభుని కల్యాణం

- భారీగా తరలివచ్చిన భక్తజనం

పద్మనాభం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : భక్తుల గోవిందనామ స్మరణ నడుమ పద్మనాభంలో అనంతపద్మనాభుని కల్యాణోత్సవం సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ఏటా ఫాల్గుణ శుద్ధ ఏకాదశి రోజున స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ విష్వక్సేన ఆరాధన, పుణ్యాహ వచనం, అగ్నిప్రతిష్ఠాపన, విశేష హోమాలు, గరుడ ప్రతిష్ఠ, ధ్వజారోహణ తదితర కార్యక్రమాలు జరిపారు. గ్రామ బలిహరణ అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను, హంసవాహనం, గజ వాహనంపై అనంతపద్మనాభస్వామి వారిని ఉంచి తిరువీధిలో ఊరేగింపుగా తీసుకువెళ్లి రచ్చబండ సమీపంలో ఎదురు సన్నాహ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు కల్యాణం కోసం కన్యాన్వేషణకు బయలు దేరడం, ఉభయ దేవేరులను స్వామివారు చూడడం, వధూవరుల పరిచయం, వారి గుణ,గణాలను వేదపండితులు వర్ణించిన విధానం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా కుంతీమాధవస్వామి ఆలయంలోని కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. అక్కడ ఆలయ ప్రధానార్చకులు పి.సీతారామాంజనేయస్వామి ఆధ్వర్యంలో వేదపండితులు అనంతపద్మనాభుని కల్యాణాన్ని కన్నుల పండువగా జరిపించారు. అనంతరం మంగళాశాసనం, ఆశీర్వచనం, తీర్థప్రసాద వితరణతో కల్యాణ క్రతువు ముగిసింది. ఉత్సవ కమిటీ సహకారంతో ఆలయ ఈవో నానాజీబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఎంపీపీ కె.రాంబాబు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కె.నగేష్‌కుమార్, లక్ష్మణరావు, ఉత్సవ కమిటీ సభ్యులు నారాయణరావు, పైడినాయుడు, ఎర్నాయుడు, పద్దు, పైడిరాజు, రాము, నరసింగరావు, సన్నిబాబు పాల్గొన్నారు. నెల్లిమర్ల దుర్గాశక్తి పీఠాధిపతి శ్రవణచైతన్యానంద భక్తులకు అభిభాషణ చేశారు.



ఎదురు సన్నాహ మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



పద్మనాభుని కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

లీ అసోసియేట్స్‌కే మాస్టర్ ప్లాన్ బాధ్యతలు

విశాఖపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం - కాకినాడ పెట్రో ఇన్వెస్టిమెంట్ అండ్ పెట్రో కారిడార్‌లోని 603. చ.కి.మీ. విస్తీర్ణంలో మాస్టర్ ప్లాన్ రూపొందించడానికి లీ అసోసియేట్స్‌ను ఎంపిక చేసినట్టు వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ తెలిపారు. ఈ పరిధిలో 10 మండలాలు, 110 రెవెన్యూ గ్రామాలున్నాయని, ఎనిమిది నెలల కాల వ్యవధిలో మాస్టర్ ప్లాన్ తయారు చేయాల్సి ఉంటుందన్నారు. దీనికి గాను ఆ సంస్థకు రూ.1.75 కోట్లు ఇవ్వడానికి ఒప్పందం జరిగిందన్నారు.

విశ్రాంత ఖజానా అధికారిపై విచారణ

విశాఖపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ట్రెజరీ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేసి జాయింట్ డైరెక్టర్ హోదాలో ఉద్యోగ విరమణచేసిన బత్తుల అరుణకుమారిపై విచారణకు అడిషినల్ డైరెక్టర్ కె.పద్మజను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఏటా ప్రభుత్వానికి తప్పుడు ఆస్తుల పత్రాలను సమర్పించారని, అక్రమ ఆస్తులు కూడగట్టారనే ఫిర్యాదుల నేపథ్యంలో పూర్తిస్థాయి విచారణకు ప్రభుత్వంఆదేశించింది.